# ఖమ్మం వాణి

నిజం నిర్భయంగా

| ఖమ్మం | మంగళవారం | 22.09.2026 | సంపుటి : 1 | సంచిక :59 | పేజీలు : 8 | వెల : 4/- |
|---|---|---|---|---|---|---|
| KHAMMAM | Tuesday | 22.09.2026 | volume : 1 | Issue : 59 | Pages : 8 | Cost : 4/- |



## విలేకరులు కావలెను

ఖమ్మం వాణి తెలుగు దినపత్రిక లో - జర్నలిస్టులకు అవకాశం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జ లు, నియోజకవర్గ ఆర్సీలు, మండల రిపోర్టర్లు కావలెను



- నిజాలను నిర్భయంగా రాసే వారికి అవకాశం
- ఎటువంటి టార్గెట్స్ లేవు

సంప్రదించండి:

91773 55174 /89780 71842




## రేపే సుప్రీంలో విచారణ

అనర్హత వేటును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

### హైకోర్టు మహాచంద్రప్రసాద్ కేసు తీర్పును ఆటోమేటిక్‌గా వర్తింపజేసింది

### పిటిషన్‌లో దానం నాగేందర్ వాదన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 : పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తనపై తెలంగాణ హైకోర్టు విధించిన అనర్హత వేటును సవాల్ చేస్తూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరగనుంది. ఈ కేసును అత్యవసరంగా విచారించాలన్న దానం తరఫు న్యాయవాది విజ్ఞప్తి, విచారణను బుధవారం చేపట్టాలన్న ప్రతివాదుల అభ్యర్థన మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. సోమవారం దానం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ

-మిగతా 2 లో..

## ఓరుగల్లు నగర సమగ్రాభివృద్ధిపై

# దృష్టి సారించండి

### వచ్చే 30 రోజులు.. 24 గంటలపాటు పని జరగాలి

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో వేగం పెంచండి

### వైద్య ఆరోగ్య, పురపాలక శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం గ్రీన్‌చానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ పనులు ఆశించిన స్థాయిలో వేగంగా సాగకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే 30 రోజులు అత్యంత కీలకమని, ఈ కాలంలో 24 గంటలూ పనులు జరిగేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారిని బాధ్యుడిగా నియమించి, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.**



హైదరాబాద్, సెప్టెంబర్ 21 : హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో సోమవారం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, ఓపీ సేవల ఏర్పాటుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఆర్‌అండ్‌బీ స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జె. చోంగ్తూ, మున్సిపల్ శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 'ఆస్పత్రి నిర్మాణ పనులకు

-మిగతా 2 లో..



## తక్షణమే నిధులు విడుదల చేయండి

భూ సేకరణ, పునరావాసం వేగంగా పూర్తిచేయండి

### రూ.813 కోట్ల పరిహారం రైతులకివ్వాలి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 21 :ప్రాజెక్టుల నిర్మాణాలకు భూ సేకరణ, పునరావాస ప్రక్రియలు వేగంగా పూర్తయ్యేలా పరిహారం చెల్లింపులు చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, భూ సేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడితో కలిసి సోమవారం

-మిగతా 2 లో..

# పైరవీలకు తావులేదు

ప్రజల సమక్షంలోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

### రాయదుర్గం ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపనలో మంత్రి పొంగులేటి

**ప్రజల సమక్షంలో అర్హులైన వారందరి పేర్లతో లాటరీ తీసి.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలోని మల్కంచెరువు సమీపంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. శేరిలింగంపల్లిలో ఇళ్లు ఎంపికైన వారికి కేటాయింపు పత్రాలు అందజేశారు.**



హైదరాబాద్, సెప్టెంబర్ 21 :"ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యానికి, పైరవీలకు తావులేదు. అర్హతే ప్రామాణికంగా తీసుకుంటున్నాం. లాటరీలో ఎంపికైన వారిని బహిరంగంగా ప్రకటించి.. వారిపై ప్రజల నుంచి అభ్యంతరాలు తీసుకునే విధానాన్ని అమలు చేస్తున్నాం. ఎకరం వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రాంతంలో ఇల్లు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం వారికి భద్రత, భరోసా కల్పిస్తోంది. ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు 17-20 గజాల వరకు అన్‌డివైడెడ్ షేర్, అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.. సేల్‌డీడ్‌ను రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందించేలా ప్రభుత్వం నిర్ణయించింది.

-మిగతా 2 లో..

## పోటీ పరీక్షల్లో సిలబస్ మార్చలేదు

### టీజీపీఎస్సీ కీలక ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 21 : ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు సంబంధించి టీజీపీఎస్సీ కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల సిలబస్‌లో మార్పుపై వస్తున్న ఊహాగానాలపై స్పందించింది. తాము ఎలాంటి సిలబస్ కమిటీని ఏర్పాటు చేయలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. సిలబస్ మార్పు ప్రచారంతో ఆందోళన చెందుతున్న అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులు, సందేహాలపై స్పందించిన

-మిగతా 2 లో..

## ఎకరం ఎండినా ప్రభుత్వానిదే బాధ్యత

ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**జూరాల రిజర్వాయర్‌లో 9 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నా.. సాగునీరు విడుదల చేయకపోవడం అన్యాయమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. జూరాల ఆయకట్టు పరిధిలో ఒక్క ఎకరం పంట ఎండినా.. ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.**



హైదరాబాద్, సెప్టెంబర్ 21 : తెలంగాణ భవన్‌లో సోమవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "వరద జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీళ్లు తీసుకెళ్తుంటే.. తెలంగాణలో నికర జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల కింద ఉన్న రైతాంగానికి సాగునీరు అందించకపోవడం ఏమిటి? ఈ ఏడాది కృష్ణా నదిలో తెలంగాణకు అందుబాటులోకి వచ్చిన 248 టీఎంసీల నీటిలో కేవలం 28 టీఎంసీలను మాత్రమే వినియోగించుకోవడం దారుణం. సొంత జిల్లా రైతులు సాగునీటి కోసం అరిగోస పడుతుంటే.. ముఖ్యమంత్రి రాజకీయాలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని నార్లాపూర్ మోటార్లను, కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి మోటార్లను

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

## రైతులు నీళ్లు లేక గోస పడుతున్నారు

జూరాల గేట్లు వెంటనే తెరవాలి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులు నీళ్లు లేక గోస పడుతున్నారని, సర్కారు జూరాల గేట్లను ఎత్తి వెంటనే నీటిని వదలాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... '

-మిగతా 2 లో..



**జూరాల జలాశయం ఆయకట్టు రైతులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో సోమవారం ప్రాజెక్టు వద్ద ఉత్కంఠ నెలకొంది. ప్రధాన ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలనే డిమాండుతో భారాస ఇచ్చిన పిలుపుమేరకు అన్నదాతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు జూరాలకు వివిధ మార్గాల్లో తరలివచ్చారు. దీంతో పోలీసులు ప్రాజెక్టు మొత్తాన్నీ తమ అధీనంలోకి తీసుకున్నారు.**

# జూరాల నీటిని విడుదల చేయండి

ప్రాజెక్టు వద్ద రైతుల ఆందోళన

### బీఆర్ఎస్ పిలుపుతో ప్రాజెక్టు వద్దకు భారీగా చేరిక

### సొంతంగా నీటి విడుదలకు యత్నం

### పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట

వనపర్తి, సెప్టెంబర్ 21 : పీజేపీ నందిమల్ల క్యాంపు వద్ద పోలీసులు రహదారికి అడ్డంగా బారికేడ్లను పెట్టగా.. రైతులు తోసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తోపులాట చోటు చేసుకుంది. అమరచింత, ఆత్మకూరు మండలాల నుంచి వచ్చిన రైతులు ప్రధాన కుడికాల్వ వద్ద ఆందోళనలు నిర్వహించారు. డీఎస్పీ గిరిబాబు, సీఐ శివకుమార్, ఎస్సైలు వారితో చర్చలు నిర్వహించినా

-మిగతా 2 లో..







## రేపే సుప్రీంలో విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ఈ వ్యవహారాన్ని ధర్మాసనం ముందు మెన్షన్ చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేపై హైకోర్టు అనర్హత వేటు వేసిందని, వాస్తవానికి స్పీకర్ ఆ పిటిషన్‌ను ముందే తిరస్కరించారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ తరపున కాకుండా వేరొకరి ఫిర్యాదు మేరకు ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయన్నారు. ఒకవేళ కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తే ఇబ్బందులు వస్తాయని, కాబట్టి మంగళవారమే ఈ కేసును అత్యవసరంగా విచారించాలని కోరారు. అయితే, ప్రతివాదుల తరపు న్యాయవాది కల్పించుకుని.. ఈ విచారణను మంగళవారం కాకుండా బుధవారం చేపట్టాలని కోరారు. అనంతరం ధర్మాసనం విచారణ బుధవారం చేపడతామని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పుపై శనివారం మధ్యాహ్నం సుప్రీంకోర్టులో దానం నాగేందర్ ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో స్పీకర్ తీసుకునే నిర్ణయాలను న్యాయస్థానాలు సమీక్షించడానికి వీల్లేదన్నది ఆయన ప్రధాన వాదన. స్పీకర్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని, అందులో ఆర్టికల్ 226 కింద హైకోర్టు జోక్యం చేసుకోకూడదని అప్పీలులో పేర్కొన్నారు. తాను బీఆర్ఎస్ సభ్యత్వాన్ని వదులుకోలేదని, కాంగ్రెస్ సభ్యత్వం కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు. కేవలం మెడలో మూడు రంగుల కండువా వేసుకున్నంత మాత్రాన కాంగ్రెస్‌లో చేరినట్లు కాదన్నారు. దానం పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు తమ వాదనలు కూడా వినాలని కోరుతూ ఏలేటి మహేశ్వర్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.




## ఎకరం ఎండినా ప్రభుత్వానిదే బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే ఆన్ చేసి రైతులకు నీటిని అందించాలి. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి 10 టీఎంసీల నీటిని తీసుకొచ్చి పంటలను కాపాడాలి. భూముల విషయంలో భారాస నేతలు ఎవరైనా తప్పు చేసి ఉంటే.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చట్టప్రకారం ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చు. అయితే కాంగ్రెస్ నాయకులు భూముల వద్దకు వెళ్లి డ్రామాలు ఎందుకు చేస్తున్నారు? మా ఆస్తులపై.. ముఖ్యమంత్రి ఆస్తులపై సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని నేను డిమాండ్ చేశా. అయినా సీఎం ఎందుకు స్పందించడంలేదు? సిరిసిల్లకు వెళ్తానని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అక్కడి ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? నేతన్నల ఆత్మహత్యలకు తానే కారణమని చెబుతారా? అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా సిరిసిల్లలో 8 వేల ఎకరాలు కబ్జా చేసిన వారి వివరాలను బయటపెట్టాలి. లేకుంటే తప్పుడు ఆరోపణలు చేసినట్లు అంగీకరించి సిరిసిల్ల ప్రజలకు సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు.



## జూరాల నీటిని విడుదల చేయండి

(మొదటిపేజీ తరువాయి)

వినలేదు. ఓ దశలో పీజేపీ నందిమల్ల క్యాంపు వద్ద రైతులు సమాంతర కాల్వ వద్దకు వెళ్లి, అక్కడి నుంచి పీజేపీ డ్యామ్ పైకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొందరు రైతులు సమాంతర కాల్వలోకి దిగి ఆందోళన చేపట్టారు. ఆత్మకూరుకు చెందిన భారాస నాయకుడు శ్రీనివాసులు పోలీసుల నుంచి తప్పించుకుని ప్రధాన ఎడమ కాల్వ హెడ్‌రెగ్యులేటర్ పైకి దూసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఆత్మకూరు మండలం గుంటిపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్ హెడ్ రెగ్యులేటర్ గేట్ల వైపు వెళ్లే ప్రయత్నంలో జారిపడటంతో చేతి మణికట్టు విరిగింది. పోలీసులు తమ వాహనంలోనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. రైతులు సమాంతర కాల్వ గేట్ల వద్దకు వస్తారని భావించిన పీజేపీ డివిజన్-5 అధికారులు ఈఈ మహేందర్, డీఈ జయశ్రీ సిబ్బందితో కలిసి కాల్వకు సంబంధించిన గేటు లోపలే కాపలాగా కూర్చున్నారు. అంతకు ముందు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రైతులతో కలిసి ప్రాజెక్టు వద్దకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆయనను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకెళ్తుండగా రైతులు, నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని పక్కకు తోసి రామ్మోహన్‌రెడ్డిని కొత్తకోట ఠాణాకు తరలించారు. .

# ఓరుగల్లు నగర సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించండి




(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి స్పష్టమైన వర్క్‌షెడ్యూల్ రూపొందించుకుని ముందుకు వెళ్లాలి. వచ్చే 30 రోజుల్లో పనులు వేగంగా పూర్తయ్యేలా అవసరమైన మానవ వనరులు, యంత్రాలు, ఇతర వనరులను సమీకరించాలి. పనులు రాత్రింబవళ్లు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి. సీఎంఓ అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలి. నిర్మాణంలోని ప్రతి అంశానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి బాధ్యత అప్పగించాలి. సంబంధిత అధికారి ఆ పనిని నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా పర్యవేక్షించాలి. ఇక నుంచి వరంగల్ కలెక్టర్ ప్రతిరోజూ ఆస్పత్రి నిర్మాణ పనులను పర్యవేక్షించాలి. వివిధ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పనుల్లో జాప్యం జరగకుండా ప్రత్యేక కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసుకుని ముందుకు వెళ్లాలి. నిర్మాణ సంస్థలు, ఆర్అండ్‌బీ, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలి. వరంగల్ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి. పూర్తిస్థాయి ఆస్పత్రి నిర్మాణం కొనసాగుతున్న సమయంలోనే సాధ్యమైన మేరకు ఓపీ సేవలను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్ సనత్‌నగర్ టిమ్స్‌లో అందుబాటులోకి తీసుకొచ్చిన తరహాలో వరంగల్‌లోనూ ఓపీ సేవలను ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేయాలి. ఆస్పత్రి భవనం మాత్రమే కాకుండా దాని చుట్టుపక్కల ప్రాంతాన్ని కూడా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి. రోగులు, వారి సహాయకులకు అనుకూలంగా ఉండేలా ఆస్పత్రి పరిసరాల్లో పారిశుధ్యం, పచ్చదనం, రహదారులు, ఇతర మౌలిక వసతులపై దృష్టి పెట్టాలి. ఆస్పత్రి కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత వైద్యులు, ఇతర సిబ్బందికి అవసరమైన సౌకర్యాలపై కూడా దృష్టి పెట్టాలి. సనత్‌నగర్ టిమ్స్‌కు సంబంధించి స్టాఫ్ క్వార్టర్స్ ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించిన పనులను తక్షణమే ప్రారంభించాలి. వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండేలా అవసరమైన వసతి సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలి. వరంగల్ ఆస్పత్రి నిర్వహణ, మెయింటినెన్స్‌ను ప్రత్యేక ఏజెన్సీకి అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రి కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే విధివిధానాలను ఖరారు చేయాలి. ఆస్పత్రి నిర్మాణం, ఓపీ సేవల ప్రారంభం, సిబ్బంది వసతి, నిర్వహణ తదితర అంశాలపై నిర్దిష్ట గడువులతో కార్యాచరణ రూపొందించి, తదుపరి సమీక్షకు పురోగతి నివేదికతో రావాలి..'అని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## పైరవీలకు తావులేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం ఒక్కో నియోజకవర్గంలో తొలి విడతగా 480 ఇళ్ల చొప్పున నిర్మించేలా.. ఇప్పటికే పలుచోట్ల టెండర్లు, ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. ఇప్పుడు ఇల్లు రాలేదని అర్హులు నిరాశ చెందాల్సిన అవసరం లేదు. నగర పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్స్ చేపట్టాం. అర్హులకు రాబోయే రెండున్నరేళ్లలో దశలవారీగా ఇళ్లు అందిస్తాం. రాయదుర్గంలో 8 ఎకరాల్లో నిర్మాణం చేపడుతున్నాం.. అవసరమైతే 13 ఎకరాలకూ విస్తరిస్తాం" అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ రఘునాథ్ యాదవ్, హౌసింగ్ బోర్డు వీసీ గౌతమ్ పాల్గొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన రెవెన్యూ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయడానికి ఉద్యోగులు మరింత కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం సచివాలయంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం(ట్రెసా) నూతన అధ్యక్షుడు కె.గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్‌రెడ్డి నేతృత్వంలో కార్యవర్గ ప్రతినిధులు మంత్రిని కలిశారు. వారిని అభినందించిన మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సత్వరమే సేవలందేలా ఉద్యోగులు పనిచేయాలని కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గం జి.దేశ్యా, నిరంజన్, వాణిరెడ్డి, రాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.

## తక్షణమే నిధులు విడుదల చేయండి

(మొదటిపేజీ తరువాయి)



హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పునరా వాసం, భూ సేకరణకు ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన రూ.813 కోట్లను జాప్యం లేకుండా రైతులకు అందించాలని ఆదేశించారు. అధికారులు మాట్లాడుతూ.. ఏప్రిల్ నుంచి నేటి వరకు రూ.3,101 కోట్లకు టోకెన్లు సమర్పించగా ప్రభుత్వం రూ.2,504 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. జిల్లాల స్థాయిలో రూ.502 కోట్లు అధికారుల వద్ద, రూ.311 కోట్లు జిల్లా కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. దీంతో స్పందించిన మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నిధులు విడుదలైన తర్వాత తప్పనిసరిగా భూములు కోల్పోయిన రైతులకు చేరాలి. కలెక్టర్లు వ్యక్తిగతంగా చొరవ తీసుకుని రైతులతో సంప్రదింపులు చేసి పరిహారం పంపిణీ పూర్తి చేయాలి. భూములు కోల్పోతున్న రైతుల పట్ల అధికా రులు న్యాయబద్ధంగా, మానవీయంగా వ్యవహరించాలి' అని పేర్కొన్నారు. నల్గొండ, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ జిల్లాల్లోని పలు ప్రాజెక్టుల కింద భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలపై జిల్లాల వారీగా ఈ సమీక్ష జరిగింది.

## రైతులంటే ఎందుకింత నిర్లక్ష్యం?

### సీఎంపై హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్:** 'పంట పొలాలకు సాగునీరు ఇవ్వలేని ప్రభుత్వం.. ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు' అని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఓ ప్రకటనలో విమర్శించారు. జూరాలలో నీళ్లున్నా రైతులకు ఇవ్వడానికి ఎందుకు మనసు రావడం లేదని, రైతులంటే ఎందుకింత నిర్లక్ష్యమని ఆయన సీఎంను ప్రశ్నించారు. "కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి 738 కి.మీ. దూరంలో ఎక్కడో పెన్నా బేసిన్‌లో ఉన్న కుప్పం వరకు తరలిస్తుంటే.. పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం ఎందుకు తరలించడం లేదు? ఇది కాంగ్రెస్ పాలనా వైఫల్యం కాదా? పాలమూరు ప్రాజెక్టులో భాగంగా నార్లపూర్, ఏదుల, కరివెన, వట్టెం.. మొత్తం 50 టీఎంసీల సామర్థ్యంతో కేసీఆర్ జలాశయాలను నిర్మిస్తే.. వాటిని నీళ్లతో నింపాలన్న ఆలోచన కూడా మీకు లేదా? గత రెండున్నరేళ్ల పాటు కృష్ణానదిలో పుష్కలంగా నీళ్లు పారినా ఎందుకు మోటర్లను నడపలేదు? కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెట్టి.. తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఎందుకు గాలికొదిలేశారు? జూరాల ప్రాజెక్టును పోలీసులు పూర్తిగా దిగ్బంధించి.. ఆనకట్ట పరిసరాల్లో భారీగా మోహరించారు. కనిపిస్తే అరెస్టులు చేస్తున్నారు. ఎందుకింత దౌర్జన్యం? రైతులు నీళ్లు అడుగుతుంటే.. వాళ్ల చేతికి సంకెళ్లు వేస్తారా? జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## పోటీ పరీక్షల్లో సిలబస్ మార్చలేదు

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్.. పోటీ పరీక్షల సిలబస్‌లో పెద్దగా ఏవైనా మార్పులు ప్రతిపాదిస్తే ఏడాది ముందే తెలియజేస్తామని పేర్కొంది. ఒకవేళ సిలబస్‌లో స్వల్ప మార్పులు ఉన్నా గానీ.. ఆ వివరాలను సంబంధిత నియామక ప్రకటనతో పాటే జారీ చేస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు.



## రైతులు నీళ్లు లేక గోస పడుతున్నారు


(మొదటిపేజీ తరువాయి)

'ఎల్‌నినో ప్రభావంతో కరవు పరిస్థితులు నెలకొన్నా రాష్ట్ర ప్రభుత్వం జూరాల గేట్లను తెరవకుండా పాలమూరు రైతులను ఇబ్బంది పెడుతోంది. సాగునీటి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మంగళవారం పార్టీ నేతలు, ఇంజినీర్లతో కలిసి ప్రాజెక్టు వద్దకు వెళ్తున్నాం. పోలీసులు సర్కారు చెప్పినట్టు నడుచుకుంటున్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల అరెస్టును ఖండిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రానికి కేంద్రం సాయం అందిస్తుందా? అన్న విలేకరుల ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. రాష్ట్రం కేంద్రానికి ఎలాంటి దరఖాస్తు చేసుకోలేదని, ప్రణాళికాబద్ధంగా అంచనా వేసి అడిగితే కేంద్రం సాయం చేస్తుందని తెలిపారు. అంతకుముందు ఏటూరునాగారం ఐటీడీఏ మాజీ పీవో చక్రధర్‌రావుతోపాటు, ఉమ్మడి వరంగల్‌కు చెందిన నేతలు రామచందర్‌రావు సమక్షంలో భాజపాలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, కొండేటి శ్రీధర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

## లోటుపాట్లకు తావులేకుండా క్రీడలు నిర్వహించాలి

### 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'పై సమీక్షలో మంత్రి శ్రీహరి

**హైదరాబాద్:** ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహించాలని రాష్ట్ర యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేలా క్రీడల నిర్వహణ ఉండాలన్నారు. సచివాలయంలో సోమవారం ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌పై మంత్రి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. "దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, సంబంధిత అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. వసతి, రవాణా, ఆహారం, భద్రత, వైద్య సదుపాయాలు, క్రీడా వేదికలు, స్వాగత ఏర్పాట్లు తదితర అంశాల్లో లోటుపాట్లకు తావులేకుండా చూడాలి. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల నిర్వహణకు వేసే ఉప కమిటీల్లో సంబంధిత క్రీడా సంఘాల ప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ ఈ క్రీడలకు సంబంధించిన తొలి ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం అక్టోబరు మొదటి వారంలో దిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీ సోనీ బాలాదేవి, అధికారులు పాల్గొన్నారు.



# మట్టిలో మాణిక్యం..

## ఎంబీబీఎస్ సీటు సాధించిన సాయి వరుణ్

**ఖమ్మం వాణి, తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 21:** పేదరికాన్ని జయించి, కష్టాన్ని ఇష్టంగా మార్చుకుని వైద్య విద్యలో సీటు సాధించాడు ఓ యువకుడు. మండల పరిధికి చెందిన బుడిగెం సాయి వరుణ్ మట్టిలో మాణిక్యంలా నిలిచాడు. బుడిగెం శ్రీలత, వెంకటేశ్వర్లు దంపతుల కుమారుడైన సాయి వరుణ్ చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయాడు. అమ్మమ్మ అల్లి యశోద వద్ద ఉంటూ రఘునాథపాలెం ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తి చేశాడు. అనంతరం ఏన్కూర్ గురుకుల పాఠశాలలో సెకండరీ విద్యను అభ్యసించాడు. 2025-26 ఎంసెట్‌లో 2088వ ర్యాంకు సాధించి వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నాడు. విషయం తెలుసుకున్న జేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ సాయి వరుణ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంబీబీఎస్‌ను దిగ్విజయంగా పూర్తి చేసి నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గ్రామ పెద్దలు గౌని మల్లయ్య, తక్కెళ్లపల్లి నరేందర్ రావు, ఎర్రబోయిన వెంకన్న, కొండ్రు మహేష్ తదితరులు సాయి వరుణ్‌ను అభినందించారు.




### పోలీసులమంటూ బెదిరింపులు..

# డిజిటల్ అరెస్ట్ పేరుతో దోపిడీ

## రూ. 4.20 లక్షల అక్రమ వసూళ్లు.. ఇద్దరు సైబర్ నేరగాళ్లు అరెస్ట్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 21 (ఖమ్మం వాణి):** పోలీసులుగా నటిస్తూ బంగారు వ్యాపారులను బెదిరించి డిజిటల్ అరెస్ట్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను కేసముద్రం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మొబైల్ ఫోన్, పోలీస్ యూనిఫాంను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ వెల్లడించారు. కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

అరెస్టయిన నిందితులు: 1. షేక్ ఇర్ఫాన్ (29), తండ్రి ఖాజా మొయినుద్దీన్, నిడమనూరు, నల్గొండ జిల్లా. 2. చింతలచెరువు ప్రశాంత్ (26), తండ్రి సైదులు, నిడమనూరు, నల్గొండ జిల్లా.

నేర విధానం: నిందితుడు షేక్ ఇర్ఫాన్ పోలీస్ యూనిఫాం ధరించి ఫొటో తీసుకుని వాట్సాప్, ట్రూకాలర్‌లో డీపీగా పెట్టుకున్నాడు. కేసముద్రం మండలానికి చెందిన బంగారు వ్యాపారి బోగోజు వేణుగోపాలచారి ఫోన్ నంబర్‌ను గూగుల్ ద్వారా సేకరించి సెప్టెంబర్ 10న ఫోన్ చేశాడు. తాను వికారాబాద్ సమీపంలోని పార్వతీపురం పోలీస్ స్టేషన్ ఎస్సైగా పరిచయం చేసుకుని ఇద్దరు దొంగలను పట్టుకున్నామని, వారు దొంగిలించిన బంగారాన్ని బాధితుడు కొనుగోలు చేశాడని, రసీదులు తమ వద్ద ఉన్నాయని బెదిరించాడు. బంగారం రికవరీగా ఇవ్వకపోతే అరెస్ట్ చేస్తామని, పరువు పోతుందని భయపెట్టి వాట్సాప్ ద్వారా క్యూఆర్ కోడ్ పంపి రూ. 88,026 వసూలు చేశాడు. ఫిర్యాదుతో కేసముద్రం ఎస్సై కేసు నమోదు చేయగా సీఐ వై. సత్యనారాయణ సాంకేతిక ఆధారాలు, సైబర్ క్రైమ్ పోర్టల్ వివరాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లను విశ్లేషించి నిందితులను గుర్తించారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై కె. క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20 సాయంత్రం ఇద్దరినీ అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో బంగారు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని సుమారు రూ. 4.20 లక్షల మేర వసూళ్లకు పాల్పడినట్లు తేలింది. గతంలోనూ వీరిపై నల్గొండ ఐ-టౌన్, ఆదిలాబాద్ ఐ-టౌన్, ఎచ్చోడ, కట్టంగూర్, తిరుమలగిరి, రామగుండం, బిక్కవోలు పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయని, జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. పోలీసుల పేరుతో వచ్చే కాల్స్, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు, అనుమానాస్పద క్యూఆర్ కోడ్‌లకు స్పందించవద్దని, మోసపోతే వెంటనే 1930కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ శబరీష్ సూచించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు పాల్గొన్నారు.




# చివ్వెంల పీహెచ్‌సీలో వైద్యుల నిర్లక్ష్యం

## వేళకు ముందే తాళాలు.. రోగులపై దురుసు ప్రవర్తన

**చివ్వెంల, సెప్టెంబర్ 21 (ఖమ్మం వాణి):** గ్రామీణ పేద ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్లక్ష్యానికి నిలయంగా మారింది. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించాల్సిన సిబ్బంది, వైద్యులు నిర్దేశిత సమయం కంటే ముందే తాళాలు వేసి వెళ్లిపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్పత్రి పనివేళలు ముగియకముందే సాయంత్రం 3:45 గంటల ప్రాంతంలోనే కేంద్రానికి తాళం వేసి సిబ్బంది వెళ్లిపోయారు. దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చిన నిరుపేద రోగులు, వృద్ధులు తాళం వేసిన ఆస్పత్రి ముందు దిక్కుతోచని స్థితిలో నిలబడాల్సి వచ్చింది. అంతేకాకుండా సమయం ఉండగానే వచ్చిన రోగులకు కనీస వైద్య పరీక్షలు చేయకపోగా వారిపై సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తూ దురుసుగా ప్రవర్తించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సేవలు అందించాల్సిన ఆరోగ్య కేంద్రం ఇలా ఇష్టారాజ్యంగా నడవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ రోగులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పెన్షన్ వెరిఫికేషన్ ముసుగులో దందా..!

- కార్యదర్శుల అక్రమ వసూళ్లు - అధికార పార్టీ నేతల అండదండలు
- ఫీల్డ్ వెరిఫికేషన్ కాదు.. ఫీల్డ్ కలెక్షన్..!



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 21 (ఖమ్మం వాణి) :** పేదల కడుపు కొడుతున్నారు.. వృద్ధుల ఉసురు తీస్తున్నారు.. ప్రభుత్వ పెన్షన్ పథకం పేరుతో తిరుమలాయపాలెం మండలంలో కొందరు పంచాయతీ కార్యదర్శులు బహిరంగ దోపిడీకి తెరలేపారనే ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. అర్హులను గుర్తించాల్సిన ఫీల్డ్ వెరిఫికేషన్.. కాస్తా ఫీల్డ్ కలెక్షన్‌గా మారిందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు గాలికి వదిలేసి, అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా.. వారు రాసిచ్చిన లిస్టే ఫైనల్‌గా పంచా యతీలు పెడుతూ దరఖాస్తుదారులను బెదిరిస్తున్నారని తెలు స్తోంది. వెరిఫికేషన్ కోసం మండలానికి వచ్చిన అధికారు లను గ్రామాలకు తీసుకెళ్లకుండా.. రహస్య ప్రదేశాల్లో చాటు మాటు సమావేశాలు.. అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై లబ్ధిదారుల జాబితాలో కోతలు, చేర్పులు.. ఇదీ ఇక్కడ జరుగుతున్న తంతు. తమకు నచ్చని వారిని, ప్రతిపక్ష అభిమానులను అనర్హులుగా చిత్రీకరిస్తూ.. సొంత పార్టీ కార్యకర్తలకు మాత్రం అర్హత లేకపోయినా పెన్షన్లు కట్టబెడుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### డబ్బులు ఇస్తేనే పెన్షన్:

"పెన్షన్ కావాలంటే ఇంత ఇవ్వాలి" అంటూ బాహాటంగా రేట్లు ఫిక్స్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు వృద్ధులు బోరున విలపిస్తున్నారు. ఇవ్వని వారి దరఖాస్తులను తొక్కిపెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వయసు మీద పడి, ఆధరువుగా భావించిన పెన్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అభాగ్యులను పీడించడం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కళ్లు తెరిచి.. ఈ పంచాయతీ కార్యదర్శులు, వారికి వత్తాసు పలుకుతున్న అధికార పార్టీ నాయకులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోకపోతే.. పేదల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

### యూపీఐ ఛార్జీల భారం

# ఉపసంహరించుకోవాలి

## సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్




**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 21 (ఖమ్మం వాణి):** డిజిటల్ లావాదేవీల పేరుతో సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులపై యూపీఐ ఛార్జీల భారం మోపడాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య, పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలోని రాయల వెంకటనారాయణ భవనంలో డివిజన్ నాయకుడు బానోతు శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. క్యాష్‌లెస్ ఎకానమీ అని గొప్పలు చెప్పి ఇప్పుడు ఫోన్ పే, గూగుల్ పే వంటి యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు విధించి ప్రజలను దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. రూ.2 వేల వరకు వసూళ్లు లేవని చెబుతున్నా అంతిమంగా ఇది ప్రజలపై ఆర్థిక భారమేనని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సిగ్గుచేటని అన్నారు. బడా కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ సామాన్యులపై పన్నుల భారం మోపడం దుర్మార్గమని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, క్యూబా, గాజా ప్రజలకు సంఘీభావంగా భగత్ సింగ్ 119వ జయంతి సభను సెప్టెంబర్ 29న ఖమ్మంలో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని, దీనిని జయప్రదం చేయాలని కోరారు. పాలేరు డివిజన్‌లో పీడీఎస్యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో గ్రామాలు, విద్యాసంస్థల్లో భగత్ సింగ్ జయంతి సభలు నిర్వహిస్తామని తెలిపారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా కులాంతర వివాహాలు చేసుకున్న వారిని సన్మానించేందుకు పాలేరు డివిజన్‌లో సభ నిర్వహిస్తామన్నారు. మండలంలో కరెంటు కోతలు, లో వోల్టేజీ సమస్యలను నివారించి రైతులకు నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రేపాకుల శివలింగం, కమ్మ కోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, యడ్లపల్లి నవీన్, పులుగుజ్జు వెంకటస్వామి, అరెంపుల వెంకన్న, రెంటాల యాదగిరి, పగిడి కత్తుల రామదాసు, చిర్రా బిక్షం, ఎడ్లపల్లి ఉపేందర్, కొత్తపల్లి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

### అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రిలో

# టీవీల దుర్వినియోగం

## ఆరోగ్య అవగాహనకు బదులు వంటల ప్రోగ్రామ్స్






చిత్రంలో టీవీలో వంట కార్యక్రమాలు చూస్తున్న దృశ్యం

**ఖమ్మం వాణి, అశ్వారావుపేట, సెప్టెంబర్ 22 :** ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు ఆరోగ్య అవగాహన కల్పించాల్సిన టీవీలు లక్ష్యాన్ని కోల్పోతున్నాయి. అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్య సమాచారానికి బదులు వంటల కార్యక్రమాలు ప్రసారం కావడం విమర్శలకు దారితీస్తోంది. నిబంధనల ప్రకారం ఆస్పత్రుల్లోని వెయిటింగ్ హాల్స్, ఓపీ విభాగాల వద్ద ఏర్పాటు చేసిన టీవీల్లో డెంగ్యూ, మలేరియా నివారణ చర్యలు, గర్భిణులకు పౌష్టికాహార సూచనలు, ఉచిత పరీక్షలు, అందుబాటులో ఉన్న మందులు, ఆరోగ్యశ్రీ పథక ప్రయోజనాలను ప్రసారం చేయాలి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి గంటల తరబడి నిరీక్షించే రోగులకు ఈ సమాచారం ఉపయుక్తంగా ఉంటుంది. అయితే అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రి ప్రధాన నిరీక్షణ ప్రాంతంలో ఉన్న టీవీలో నిత్యం వంటల ప్రోగ్రామ్‌లు, వినోద కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల టీవీ ఏర్పాటు ఉద్దేశం నెరవేరడం లేదని రోగులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేద రోగులకు ఉపయోగపడే సమాచారం అందించాల్సింది పోయి వినోద కార్యక్రమాలు వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత వైద్యాధికారులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పందించి టీవీల్లో కేవలం ఆరోగ్య అవగాహన వీడియోలు, వైద్య సేవల మార్గదర్శకాలను మాత్రమే ప్రసారం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలకు శీనన్న భరోసా

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 21 (ఖమ్మం వాణి):** ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబురు దయాకర్ రెడ్డి అన్నారు. మంత్రి చొరవతో తిరుమలాయపాలెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 114 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 35 లక్షల 56 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఖమ్మం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. తుంబురు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మా కమిటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించడం వల్ల వైద్యపరంగా ఎంతో భరోసా కలుగుతోందన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో మంత్రి పొంగులేటి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పేద ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలవడమే మంత్రి లక్ష్యమని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా క్యాంపు కార్యాలయం నిరంతరం పనిచేస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ సహాయం అనేక కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్, కాంగ్రెస్ జిల్లా కమిటీ కార్యదర్శి ఉన్నం రాజశేఖర్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి, బొల్లికొండ రాజశేఖర్, గుమ్మడి దేవబిక్షం, కొప్పుల రాంరెడ్డి, నంద్యాల శ్యాంసుందర్ రెడ్డి, జడల నగేష్, దూదిమెట్ల వెంకట్, బత్తుల రవికుమార్, గుగ్గిళ్ల అంబేద్కర్, కర్నాటి రాజేంద్రప్రసాద్, కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, మోరపాక నాగయ్య, సునావత్ అశోక్, జడల రమేష్, ఫయాజ్, పుసులూరి సురేష్, అనిల్ రెడ్డి, బత్తుల సుమన్ రెడ్డి, నందిపాటి మల్లికార్జున్, అంగిరేకుల సతీష్, లంజపల్లి శ్రీనివాస్, పొట్ల కిరణ్, గుగ్గిలోత్ సురేష్, షకీల్ పాషా, గొల్ల లింగన్న, తిమ్మిడి వెంకట్ పాల్గొన్నారు.





# సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆపన్నహస్తం

- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి సిఫారసుతో 223 మందికి రూ.78.17 లక్షల సాయం
- లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి

**ఖమ్మం, సెప్టెంబర్ 21(ఖమ్మం వాణి):** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన, అలాగే ఉభయ జిల్లాల్లోని వివిధ మండలాలకు చెందిన మొత్తం 223 మందికి పైగా లబ్ధిదారులకు..రూ.78.17 లక్షల విలువ చేసే చెక్కులను.. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కాంగ్రెస్ నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడం ఎంతో ఊరటనిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఊరట

## నిబంధనలు సడలిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం!

- వన్‌టైమ్ క్లియరెన్స్‌తో నిధుల విడుదల.. ఈ సడలింపు ఒక్కసారికి మాత్రమే : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, (ఖమ్మం వాణి):** ఇందిరమ్మ ఇళ్ల పథకం అమల్లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, నిర్మాణంలోని ఇళ్లకు నిధులు అందేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అనేక విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని,ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిబంధనలను సడలిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్ల పోర్టల్‌లో ఇప్పటికే మంజూరై బేస్‌మెంట్ లేదా అంతకంటే పై స్థాయికి చేరుకున్న ఇళ్లకు ఎల్ త్రీ (ఎ3) నుంచి ఎల్ వన్ (ఎ1) కేసులకు ఒకేసారి ప్రత్యేక అనుమతి ఇస్తూ నిధులు విడుదలకు ప్రభుత్వం అనుమతించిందని మంత్రి పొంగులేటి తెలిపారు.ఈ ప్రత్యేక సడలింపు కేవలం ఈ ఒక్కసారికి మాత్రమే వర్తిస్తుందని,భవిష్యత్‌లో ఎల్ త్రీ మంజూరులకు దీనిని ప్రాతిపదికగా పరిగణించరాదని ఆయన స్పష్టం చేశారు.ఈ నిర్ణయం వల్ల ఏర్పడే మొత్తం ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.అదేవిధంగా, ఇల్లు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు నిర్మాణం ప్రారంభం కాని వాటిని రద్దు చేసి, ఆ స్థానంలో నిజమైన అర్హులైన పేదలకు వాటిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.




# చివ్వెంలలో గురుపూజ విడ్డూరం..

- ఉత్తమ ఉపాధ్యాయుల కోటాలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు సన్మానం
- నిబంధనలు తుంగలో తొక్కిన విద్యాశాఖ అధికారి

**చివ్వెంల, సెప్టెంబర్ 21 (ఖమ్మం వాణి):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులను సత్కరించాల్సిన పవిత్రమైన గురుపూజోత్సవ వేదికపై ఓ అధికారి తన అభిమానాన్ని చాటుకున్నారు. బోధనతో, చాక్‌పీస్‌తో సంబంధం లేని కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ఉత్తమ ఉపాధ్యాయుడి హోదా కల్పించి సన్మానించిన విచిత్ర ఘటన చివ్వెంల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సెప్టెంబర్ 5 గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని చివ్వెంల మండలంలో 28 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్, కేజీబీవీల నుంచి ఉపాధ్యాయ సంఘాల వారీగా కోటాలు కేటాయించారు. అయితే ఎంఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను సైతం ఉపాధ్యాయుల జాబితాలో చేర్చి సన్మానించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తరగతి గది ముఖం చూడని వ్యక్తికి ఉత్తమ ఉపాధ్యాయుడి కిరీటం తొడగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారికి సన్మానం పొందుతున్న వారి పూర్తి వివరాలు తెలియకపోవడంతో జాబితాలో ఉన్న వారందరికీ శాలువాలు కప్పారు. తెరవెనుక ఉన్న ఓ విద్యాశాఖ అధికారే పథకం ప్రకారం తన అభిమాన ఉద్యోగికి ఈ సత్కారం దక్కేలా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సన్మాన సంబరాల పేరుతో మండలంలోని సుమారు 16 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు మధ్యాహ్నం నుంచే విధులకు గైర్హాజరైనట్లు తెలిసింది. సన్మాన వేదికైన చివ్వెంల ఉన్నత పాఠశాలలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం మొదలవుతుందన్న కారణంతో విద్యార్థులకు అనధికారికంగా తరగతులు రద్దు చేసి ఇళ్లకు పంపించేశారు. అర్హులైన గురువులను కించపరిచేలా వ్యవహరించిన అధికారి తీరుపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# 9 ఎకరాల ప్రభుత్వ భూమి మాయం

- మంత్రి మౌనం వెనుక మతలబేంటి?
- సర్వే నం.254లో కోట్ల విలువైన భూమికి రక్షణ కరువు.. హెచ్చరిక బోర్డు మాయం

**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 21 (ఖమ్మం వాణి):** మండల కేంద్రంలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంటుంటే అధికార యంత్రాంగం నిద్రమత్తులో ఉందా? అధికార పార్టీ మంత్రి కళ్లు మూసుకున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తిరుమలాయపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 254లో ఖాస్రా పహాణీ ప్రకారం 10.01 ఎకరాలకు గాను కుంటలో పోను మిగిలిన 9.01 ఎకరాల ప్రభుత్వ భూమి ఇప్పుడు కబ్జాదారుల కన్ను పడింది. గతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డును గుట్టుచప్పుడు కాకుండా తొలగించారు. సరిహద్దు రాళ్లు సైతం మాయం చేశారు. దీంతో భూమి ఆక్రమణకు రహదారి వేసినట్లైంది. ఈ అక్రమాలపై బీఎస్పీ పాలేరు అసెంబ్లీ కమిటీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించింది. పాలేరు అసెంబ్లీ అధ్యక్షులు ఎన్నబోయిన రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే మాట్లాడుతూ.. ఇంత స్పష్టంగా ఆధారాలతో సహా ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోందని చెబుతున్నా సంబంధిత మంత్రి ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. మంత్రి మౌనం వెనుక ఎవరి హస్తం ఉంది? కబ్జాదారులకు అండదండలు ఎవరివి? అని నిలదీశారు.







### ఐటీఐ భూమి పేరుతో మరో డ్రామా?

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి:**

తిరుమలాయపాలెం మండలానికి మంజూరైన ఐటీఐ కళాశాల పేరుతో కూడా సర్వే నం.254లోని భూమిపై కన్నేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవ పరిస్థితిని పరిశీలించకుండా హడావుడిగా వ్యవహరిస్తే ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల పరం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి. అన్యాక్రాంతమైన తర్వాత మేల్కొనడం కాదు, ఇప్పుడే కాపాడాలని బీఎస్పీ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే చొరవ తీసుకుని సర్వే నం.254లో పూర్తి స్థాయి అధికారిక సర్వే నిర్వహించాలని, శాశ్వత సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని, తొలగించిన హెచ్చరిక బోర్డును తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలేరు అసెంబ్లీ ఇంచార్జ్ నల్లగట్టు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## పిఠాపురం అభివృద్ధికి మరో ముందడుగు

**రూ.1,500 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**కాకినాడ :** పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఫకృద్దీన్‌పాలెం లో సుమారు రూ.73 లక్షలతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రారంభిం చారు. అనంతరం పిఠాపురంలో రూ.1.83 కోట్లతో అభివృద్ధి చేసిన పీఠికాపుర వనాన్ని ప్రారంభించి మొక్క నాటారు. గతంలో డంపింగ్ యార్డుగా ఉన్న ప్రాంతాన్ని హరితవనంగా తీర్చిదిద్దడంతో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటు లోకి వచ్చింది. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, బటర్‌ఫ్లై గార్డెన్, నక్షత్రవనం తదితర సదుపాయాలను వనంలో ఏర్పాటు చేశారు. అనంతరం యు.కొత్తపల్లి మండలంలోని నాగులపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, చెరువుల అభివృద్ధి, తీర ప్రాంత రక్షణ తదితర రంగాల్లో భారీ స్థాయిలో పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా సుమారు రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు రెండు రోజుల పర్యటనలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## బీజేపీ కార్యకర్త కుటుంబానికి అండగా ఆర్థిక సహాయం

**వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం టేకుల సోమవారం గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త కీర్తి వెంకటేశం టేకుల సోమవారం మాజీ వార్డు మెంబర్ పరమపదించిన సందర్భంగా వారి దశదినకర్మకు హాజరై బిజెపి వలిగొండ మండల శాఖ కార్యకర్తలు కలిసి ఆర్థిక సహాయం మొత్తంగా రూ.32000 అందించడం జరిగింది .ఆర్థికంగా సహకరించిన ప్రతి నాయకునికి కార్యకర్తకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు బంధారపు లింగస్వామి గౌడ్,బిజెపి మండల నాయకులు మురళీధర్ రెడ్డి, మల్లారెడ్డి రంజిత్ రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు బంధారపు రాములు, రామచంద్రు, శ్యామల అనిల్ రెడ్డి, నవీన్ రెడ్డి,పాండు కొండల్ రెడ్డి, సురేందర్ రెడ్డి శివకొంతం మొదలగు నాయకులు పాల్గొన్నారు వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.

## ఎస్టీయు-టిఎస్‌కు 80 వసంతాలు

**గోడ పత్రికను ఆవిష్కరించిన డీఈవో రేణుకాదేవి**



**మేడ్చల్ :** ఎస్.టి.యు - టి.ఎస్ తెలంగాణ రాష్ట్రం లో 80 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా ఎస్.టి.యు నాయకులు సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని డీ.ఈ.వో కార్యాలయంలో డీ.ఈ.ఓ రేణుకా దేవి చేతుల మీదుగా పోస్టర్ ను ఆవిష్కరింప జేశారు. ఈ సందర్భంగా డీఈవో రేణుకాదేవి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల హక్కుల సాధనతో పాటు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించడానికి స్టేట్ టీచర్స్ యూనియన్ ఎనిమిది దశాబ్దాలుగా చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. 80 వసంతాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ సంఘం నిరంతరం విద్యా వ్యవస్థ బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి తోడ్పాటునందిస్తోందన్నారు. విద్యారంగంలో వస్తున్న నూతన మార్పులను అందిపుచ్చుకుంటూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత, అభ్యసన సామర్థ్యాలను మరింత పెంచే దిశగా ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలనీ సూచించారు. ఎస్.టీ.యూ 80 వసంతాల వైభవోత్సవం విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. ఎస్.టి.యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, ఊరెళ్ళ విఠల్ లు మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో ఎస్.టి.యు ప్రస్థానం ఆదర్శనీయమన్నారు. 1940లలో ప్రారంభమైన ఈ మహోద్యమం నేటికీ విలువలతో కూడిన పోరాటాన్ని, నిర్మాణాత్మక సహకారాన్ని కొనసాగిస్తోందన్నారు. ఉపాధ్యా యుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ ఈ 80 వసంతాల వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో గెజిటెడ్ హెడ్ మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాంరెడ్డి, టి.పి.ఆర్.టి.యు జిల్లా అధ్యక్షులు శ్రీధర్, జిల్లా ఏడీ లింగానందం, సూపరింటెండెంట్ సంధ్య, కాప్రా ఎం.ఈ.వో ఆజమ్, జిల్లా అధికారి సత్యనారాయణ, ఎస్.టి.యు - టి.ఎస్ కీసర ప్రధాన కార్యదర్శి సతీష్, మల్కాజిగిరి జిల్లా పరిషత్ హై స్కూల్ ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు శ్రీపాద, డీఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## జెపొరిజియా లక్ష్యంగా రష్యా దాడులు

కీవ్: రష్యా, ఉక్రెయిన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. కీవ్ సైన్యం ఆదివారం దాదాపు 1000కి పైగా డ్రోన్లలో రష్యాపై దాడి చేసిన నేపథ్యంలో.. రష్యా ప్రతిదాడులకు దిగింది. ఉక్రెయిన్‌లో కీలకమైన జపోరిజియా నగరంపై దాడులు ప్రారంభించింది. నగరంలోని షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్లను లక్ష్యంగా చేసుకొని మాస్కో దాడులు చేస్తున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ దాడుల్లో పలువురు గాయపడినట్లు తెలిపారు. తాజా దాడులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. రష్యా రిఫైనరీలను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందన్నారు. తమ రిఫైనరీలపై దాడులు చేయడంతో మాస్కో నియంత్రణ కోల్పోయిందని చెప్పారు. పరస్పర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో యుద్ధ విరమణ దిశగా ప్రయత్నాలు ఫలించే అవకాశాలు కనిపించడం లేదు. న్యూయార్క్‌లో ఈ వారం ఐక్యరాజ్య సమితి వార్షిక సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో.. జెలెన్‌స్కీ సమావేశమయ్యే అవకాశం ఉంది. రష్యాతో ఉద్రిక్తతలు తగ్గించే అంశంపై వారు చర్చించే అవకాశం ఉంది. అయితే, ఈ సమావేశానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ హాజరు కావడం లేదు.



## అయోధ్య రామాలయంలో 105 సార్లు విరాళాల చోరీ

అయోధ్య : అయోధ్య రామాలయంలో విరాళాల చోరీకి సంబంధించి సిట్ దర్యాప్తులో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఒకట్రెండు సార్లు కాదు.. ఏకంగా 105 సార్లు విరాళాల చోరీ జరిగినట్లు సిట్ గుర్తించింది. చోరీ దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయినట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. చోరీకి పాల్పడిన వారందరినీ గుర్తించినట్లు వివరించింది. అయోధ్య విరాళాల చోరీ కేసుపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. సిట్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తులో గుర్తించిన వివరాలను న్యాయస్థానానికి వివరించారు. పూర్తిస్థాయి దర్యాప్తు త్వరలోనే పూర్తవుతుందని, సెప్టెంబర్ 25 లోపు ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. విచారణ సందర్భంగా న్యాయస్థానం పలు అంశాలను లేవనెత్తింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు ఎంతమందిని అరెస్టు చేశారు?ఆధారాల సేకరణ ఎంత వరకు వచ్చింది?తదితర అంశాలపై తుషార్ మెహతాను ప్రశ్నించింది. ఇప్పటి వరకు సేకరించిన సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలను కోర్టుకు సిట్ సమర్పించింది. దర్యాప్తు వివరాలకు సంబంధించిన కాపీలను తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా.. న్యాయస్థానం తిరస్కరించింది. నిధుల చోరీ కేసు వ్యవహారంలో తన డ్రైవర్ అరెస్టు కావడంతో శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రాయ్, మరో సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ట్రస్టులో సీఈవో నేతృత్వంలో పరిపాలనా వ్యవస్థను అమలు చేశారు. మాజీ సైనికాధికారి జితేంద్ర మిశ్రాను సీఈవోగా నియమించారు.

## రాజీనామా చేసిన అభ్యర్థుల నుంచి పరిహారం ఆదేశించలేం



మద్రాసు హైకోర్టు

**చెన్నై:** రాజీనామా చేసిన వ్యక్తి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే.. ఆ వ్యక్తి నుంచి పరిహారం వసూలు చేయాలని తాము భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేమని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ఏ ప్రాతిపదికన ఆదేశాలు జారీ చేయగలమని ప్రశ్నించింది. రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో పోటీ చేసే వారి నుంచి నష్టపరిహారం వసూలు చేయడానికి ఇంకా ఎటువంటి చట్టం లేదని పేర్కొంది. అసలు చట్టమే లేనప్పుడు, నష్టపరిహారం వసూలు చేయాలని కోర్టు ఎలా ఆదేశించగలదని ప్రశ్నించింది. కేసుల కోసం న్యాయస్థానాలు చట్టాలను రూపొందించలేవని స్పష్టం చేసింది. ఒకస్థానం నుంచి గెలిచి.. ఆ స్థానానికి రాజీనామా చేసిన అభ్యర్థులు పరిహారం చెల్లించేలా ఆదేశించాలని దాఖలైన పిల్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమిళనాడులో కొన్ని నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధురాంతకం, ధారాపురం సహా పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే తరపున పోటీ చేసి గెలుపొందిన కొందరు ఎమ్మెల్యేలు కొన్ని రోజులకే రాజీనామా చేసి అధికార టీవీకేలో చేరారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రెండు స్థానాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నిక జరగనుంది. దీనిని సవాలు చేస్తూ చెన్నైకి చెందిన ఓ న్యాయవాది మద్రాస్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.




## పశ్చిమాసియా ఘర్షణలు..

**ఇరాన్ అధ్యక్షుడి బృందానికి అమెరికా వీసాల నిరాకరణ**

అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన అంశాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మంగళవారం ఐరాస సమావేశం కోసం అమెరికా వెళ్లనున్న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ వెంట వచ్చే బృందం మొత్తానికి వీసాలు ఇచ్చేందుకు అమెరికా నిరాకరించింది. దాంతో అనుకున్నదానికంటే తక్కువమంది ప్రతినిధులతో పెజెష్కియాన్ యూఎస్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ వారం న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ (యూఎన్‌జీఏ) 81వ సమావేశాలు జరగనున్నాయి. సభలో ఇరాన్ అధ్యక్షుడు ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పలు దేశాల నేతలు, ప్రతినిధులతో సమావేశం కానున్నారు. పరిమితస్థాయి బృందంతోనే అధ్యక్షుడు యూఎన్ సమావేశానికి వెళ్తారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. పశ్చిమాసియా యుద్ధం , ఇరాన్‌పై అమెరికా చర్యలపై ఆయన మాట్లాడనున్నారని పేర్కొంది. ఇక, ఇరాన్ బృందంపై అమెరికాలో ప్రయాణ ఆంక్షలు ఉంటాయని, విలాస వస్తువులు, ఇతర వస్తువుల కొనుగోలుపై నిషేధం ఉంటుందని ఇప్పటికే అగ్రరాజ్యం వెల్లడించింది.



## నిద్రపోయే ముందు

# వాటర్ తాగవచ్చా?

నీరు ప్రతి ఒక్కరికి జీవనాధారం. ఎక్కువగా నీరు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయి. డ్కెలీ సరిపడా నీరు తాగడం వల్ల సగం అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చని నిపుణులు చెబుతుంటారు. నీరు తాగడం వల్ల జీవక్రియ ఆరోగ్యంగా ఉండటంతో పాటు శరీరంలోని భాగాలకు కూడా ఆక్సిజన్ సరిగ్గా లభిస్తుంది. ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే గ్లాసు గోరువెచ్చని నీరు తాగితే రోజంతా యాక్టివ్‌గా ఉండటంతో పాటు ఆరోగ్యంగా ఉంటారు. కానీ చాలా మంది పనిలో బిజీ అయిపోయి తక్కువగా వాటర్ తీసుకుంటారు. రోజులో ఏ సమయంలో అయిన నీరు తీసుకోవడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారు. కొందరు రోజంతా వాటర్ ఎక్కువగా తాగకుండా నిద్రపోయే ముందు తాగుతుంటారు. అయితే నిదపోయే ముందు నీరు అధికంగా తాగడం అసలు ఆరోగ్యానికి మంచిదేనా? అనే సందేహంలో పడుతుంటారు. ఇంతకీ నిద్రపోయే ముందు నీరు తాగవచ్చా? తాగితే ఏమవుతుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం. నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల బాడీ హైడ్రేట్‌గా ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఎవరైతే డీహైడ్రేషన్ సమస్యతో బాధపడుతున్నారో వారు నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల బాడీకి మంచి జరుగుతుంది. అలాగే నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల ఉదయం లేచిన వెంటనే శరీరంలోని వ్యర్థాలు మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయి. అంతే కాకుండా మలవిసర్జన కూడా ఫ్రీగా అవుతుంది. కొందరు ఎక్కువ ఒత్తిడికి, ఆందోళనకు గురవుతుంటారు. ఇలాంటి వారు నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల వీటి నుంచి విముక్తి పొందుతారు. అలాగే మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అయితే చల్లని నీరు కంటే గోరువెచ్చని నీరు నిద్రపోయే ముందు తాగితే ఆరోగ్యానికి ఇంకా మంచిది. వేడి నీరు జీర్ణక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో బాగా ఉపయోగపడుతుంది. నిద్రపోయే ముందు నీరు తాగడం వల్ల ప్రయోజనాలే కాదు.. నష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు అంటున్నారు. పడుకునే ముందు అధికంగా నీరు తాగడం వల్ల ఎక్కువగా మూత్రానికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో పదే పదే లేవడం వల్ల నిద్రకు భంగం కలుగుతుంది. హాయిగా పడుకున్న తర్వాత నిద్రకు ఆటంకం కలిగితే మానసిక సమస్యలు వస్తాయని నిపుణులు అంటున్నారు. దీంతో నిద్రలేమి వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. నిద్ర సరిగ్గా లేకపోతే గుండె పోటు వచ్చే ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి నిద్రకు ఆటంకం కలిగించే విధంగా అధికంగా నీరు తాగవద్దు. నిద్రపోయే గంట ముందు నీరు తాగితే మూత్ర విసర్జనకు అంత ఇబ్బంది ఉండదు. అయితే నిద్రపోయే ముందు గ్లాసు వరకు నీటిని తీసుకోవడం మంచిది. అవసరమైతే పండ్లు రసాలు వంటివి తాగితే ఇంకా ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. నిద్రపోయేటప్పుడు జ్యూస్ తాగడం వల్ల యంగ్ లుక్‌లో కనిపిస్తారు.

# ఉసిరిరసంతో మధుమేహానికి చెక్





ఆరోగ్యానికి ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. దీనిని డ్కెలీ డ్కెట్‌లో చేర్చుకోవడం వల్ల బోలెడన్నీ ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతుంటారు. రోజూ ఉసిరి కాయను తినడం వల్ల ఆరోగ్యం మెరుగు పడటంతో పాటు జుట్టు, చర్మం ఆరోగ్యంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఉసిరిలో ఎన్నో ఔషధ పోషకాలు కూడా ఉన్నాయి. ఇవి ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా శరీర ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అయితే సీజనల్‌గా ఈ ఉసిరి ఎక్కువగా దొరుకుతుంది. ముఖ్యంగా ఈ సీజన్‌లో అయితే మార్కెట్లో తాజా ఉసిరికాయలు లభిస్తాయి. కొందరు ఉసిరితో పచ్చళ్లు కూడా చేసి పెట్టుకుంటారు. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని భావిస్తారు. అయితే ఉసిరి కాయను డ్కెరెక్ట్‌గా తినడమే కాకుండా వీటితో జ్యూస్ చేసి కూడా తాగుతుంటారు. ఈ జ్యూస్‌ను తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయట. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారికి ఈ జ్యూస్ బాగా ఉపయోగపడుతుంది. మరి మధుమేహులు ఈ జ్యూస్ తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం. ఈ రోజుల్లో చాలామంది మధుమేహంతో ఇబ్బంది పడుతున్నారు. దీని బారిన పడితే ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే కొన్ని సార్లు మరణం కూడా సంభవించే అవకాశం ఉంటుంది. దీని బారిన పడిన వారు ముఖ్యంగా ఆహార విషయంలో అయితే చాలా అనిగి మనిగి ఉండాలి. ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాలు మాత్రమే తీసుకోవాలి. స్వీట్లు, కొన్ని పండ్లు, తీపి పదార్థాల జోలికి అసలు వీరు పోకూడదు. అయితే మధుమేహం ఉన్నవారు ఉసిరి రసాన్ని తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. రోజూ ఉదయం పూట ఉసిరి రసాన్ని తాగితే మధుమేహులకు మంచి ఫలితం ఉంటుందట. అయితే ఈ ఉసిరి జ్యూస్‌లో పసుపు, తేనె కలిపి తాగితే ఇంకా ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. కేవలం మధుమేహులకు మాత్రమే కాకుండా గుండె ఆరోగ్యానికి కూడా ఉసిరి జ్యూస్ సాయపడుతుంది. డ్కెలీ ఉసిరి రసం తాగడం వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. జ్వరం, దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి విముక్తి కల్పిస్తుంది. ఆస్తమా ఉన్నవారికి ఉసిరి బాగా ఉపయోగపడుతుంది. అయితే కేవలం వీటికే కాకుండా జుట్టు, చర్మ ఆరోగ్యానికి కూడా ఉసిరి బాగా పనిచేస్తుంది. ఈ ఉసిరి ప్యాక్‌ను జుట్టుకు అప్లై చేస్తే జుట్టు మృదువుగా తయారవుతుంది. ఉసిరి కాయలను ఎండలో ఎండబెట్టి పౌడర్ చేసుకుని నిల్వ ఉంచుకోవాలి. ఈ పౌడర్‌ను తలకు పట్టిస్తే జుట్టు నిగనిగలాడుతుంది. అలాగే ఉసరి కాయలను తిన్నా లేదా జ్యూస్ తాగిన చర్మం కూడా మెరుగుపడుతుంది. ఉసిరి రసంలో ఎక్కువగా విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మ, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. కాబట్టి సీజనల్‌గా దొరికనప్పుడు అయిన కూడా ఉసిరిని డ్కెలీ తినడం ఆరోగ్యానికి మంచిది.



పిల్లలు మంచి పద్ధతిలో ఎదగడంలో, మంచి సంస్కారం పొందడంలో కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో కీలకం. పిల్లలు తల్లిదండ్రుల నుండి మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులందరి నుండి ఏదో ఒక గుణాన్ని నేర్చుకుంటారు. ముఖ్యంగా ఇంట్లో పెద్దలు ఉంటే అది ఒక విధంగా ఆశీర్వాదం లాంటిదే. పిల్లలకు మంచి సంస్కారాన్ని అందించడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. తాతయ్యలతో పెరిగే పిల్లలు ఖచ్చితంగా వారి నుండి కొన్ని లక్షణాలను నేర్చుకుంటారు, అవి ఏమిటో తెలుసుకుందాం. సీనియర్ సిటిజన్లు మనంత చదువుకోకపోయినా జీవితానుభవం కొండంత కలిగి ఉంటారు. అతను జీవితంలోని ఏడు పతనాలను చాలాసార్లు చూశాడు , ఎదుర్కొన్నాడు. ఈ పరిస్థితుల్లో వారికి ఉండే ధ్కెర్యం, నిజాయితీ, సహనం వంటి లక్షణాలను కూడా పిల్లలు తమ జీవితానుభవాల నుంచి నేర్చుకుంటారు. ఖాళీ సమయం దొరికినప్పుడు టీవీ, మొబ్కెల్ ఫోన్లలో ఎక్కువ సమయం కేటాయిస్తాం. కానీ మా తల్లిదండ్రులు తమ ఖాళీ సమయాన్ని తోటలో, వంట చేస్తూ, సంగీతం వింటూ గడుపుతారు. తాతముత్తాతల ఈ గుణాలను చూసి మనవాళ్ళు వారిని అనుకరించడం మొదలు

# ఈ ఆలోచనలను పెద్దలు పిల్లలకు నేర్పించవచ్చు..!

పెడతారు. జీవితం కేవలం మొబ్కెల్ ఫోన్ మాత్రమే కాదని పిల్లలు తమ పెద్దల నుండి నేర్చుకుంటారు. మీ ఇంట్లో పెద్దలు ఉంటే, మీరు వారిని పట్టించుకోకూడదు లేదా పట్టించుకోకూడదు. పిల్లలు ఈ ప్రవర్తనలను వారి తల్లిదండ్రుల నుండి నేర్చుకుంటారు. తరువాత, మీరు పెద్దయ్యాక, పిల్లలు మీతో అలాగే ప్రవర్తించవచ్చు. కాబట్టి మీరు వారి పెద్దల పట్ల శ్రద్ధ వహిస్తున్నప్పుడు మీ పిల్లలను ఎలా చూసుకోవాలి? వృద్ధాప్యంలో మన తల్లిదండ్రులను ఎలా చూసుకోవాలి? దాని గురించి పాఠం నేర్చుకోండి. పిల్లలకు మంచి సంస్కారాన్ని అందిస్తుంది. పని నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు పిల్లలతో ఎక్కువ సమయం గడిపే ఓపిక ఉండదు. కానీ వాళ్లతో పోలిస్తే తాతయ్యలకు ఓపిక ఎక్కువ. ప్రేమ ప్రాముఖ్యత అందరికీ తెలిసిందే. కృతజ్ఞతతో జీవితాన్ని ఎలా గడపాలనే గుణాన్ని కలిగి ఉంటారు. పిల్లలు ఇవన్నీ పెద్దల దగ్గర నేర్చుకుంటారు. మన గత తరాలు ఎన్నో చారిత్రాత్మక సంఘటనలకు సాక్ష్యంగా ఉన్నాయి. వారికి దశాబ్దాల క్రితం నాటి కథలు తెలుసు. పిల్లలు తమ తాతయ్యలతో ఉన్నప్పుడు, వారు తమ మనవళ్లకు ఈ కథలను చెబుతారు. దీనివల్ల పిల్లలకు చరిత్రపై అవగాహన పెరుగుతుంది. కాలం గడుస్తున్న కొద్దీ మనమందరం ఆధునిక యుగంలోకి వెళ్తున్నాం. కానీ మన ముందు తరాలు ఇప్పటికీ సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. మా కుటుంబ సంస్కృతి , సంప్రదాయాలు మా తల్లిదండ్రులకు బాగా తెలుసు. అందువలన తాతలు తమ మనవళ్లకు వీటిని నేర్పిస్తారు. దీనివల్ల మన సంప్రదాయాలను తర్వాతి తరానికి అందించవచ్చు.

# యుక్తవయస్సు వచ్చిన కొడుకుపట్ల తల్లి వైఖరి ఇలా ఉండాలి..!



పిల్లలు పెరిగి పెద్దవారై వెళ్లిపోతారు. మన కళ్లముందే ఎదుగుతున్న పిల్లలను చూస్తుంటే.. ఛాతీ వరకు పెరిగే సరికి పిల్లలు ఇంత త్వరగా ఎదిగిపోయారేమో అనిపిస్తుంది. యుక్తవయస్సు శారీరకంగా , మానసికంగా మారుతుంది. అందువల్ల, వయస్సు వచ్చిన కొడుకు విషయంలో తల్లి చాలా జాగ్రత్తగా ఉండాలని , ఆమె ఎలా ప్రవర్తించాలో చాణక్యుడు సలహాలు ఇచ్చాడు. యుక్తవయసులో ఉన్న కొడుకును పెంచేటప్పుడు జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. చిన్న విషయాలకు అమ్మ తిట్టడం, కొట్టడం వంటివి చేయకూడదు. ఈ కుటుంబంలో తనకు కూడా ముఖ్యమైన స్థానం ఉందని భావించే విధంగా ఇంటి వాతావరణం ఉండాలి. పిల్లల విషయంలో జాగ్రత్తలు అతిగా ఉండకూడదు. ప్రేమించడం నిజం, కానీ ఈ సమయంలో అది విచక్షణతో వ్యవహరించాలి. కొడుకు ఏది అడిగినా ఇవ్వడం సరికాదు. తక్కువ డబ్బుతో పిల్లలకు వస్తువులు ఇచ్చినా పిల్లలకు ఎంత ఖర్చవుతుందో అర్థం కావడం లేదు. ఆ సమయంలో ఏది అవసరమో అది ఇవ్వడం మంచిదని చాణక్యుడు చెప్పాడు. టీనేజ్ కొడుకు దగ్గర పడుకోవడం సరికాదు. ఈ విషయంలో జాగ్రత్త అవసరం. తల్లిదండ్రులు తమ కొడుకుకు డబ్బులు ఇవ్వడం సరికాదు. పాఠశాల వయస్సులో అతని స్నేహితులను , వారి ప్రవర్తనను తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఛాతీ ఎత్తుకు ఎదిగిన కొడుకు ముందు భార్యాభర్తలు సరసాలు ఆడకూడదు. దీని వల్ల కొడుకు మనసు చంచలంగా మారే అవకాశం ఉంది. ఇలా కూడా చేస్తే తప్పేంటి అనే ఫీలింగ్ లో కొడుకు దారి తప్పిన సందర్భాలు ఎక్కువే అని చెప్పొచ్చు. ఎదిగిన కొడుకు ముందు తల్లిదండ్రులిద్దరూ గొడవ పడటం సరికాదు. పిల్లల ముందు ఒకరినొకరు తిట్టుకోవడం వల్ల తల్లిదండ్రులు బాధపడతారు. కానీ మీ గొడవలు మీ కొడుకు పెళ్లి విషయంలో చేదుగా అనిపిస్తాయి. కొడుకును చదివించాలనుకుంటే వీల్కెనంత వరకు చదివించండి. పిల్లల చదువు విషయంలో ఏ కారణం చేతనూ అడ్డుకోకూడదు. చదువులు సగంలో ఆపేస్తే పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుంది. అందువల్ల పిల్లలను విద్యారంగంలో , ఆసక్తిలో పాల్గొనేలా ప్రోత్సహించమని చాణక్యుడు చెప్పాడు. కొడుకు తన సొంత హోదాలో ఉన్న అమ్మాయిని వివాహం చేసుకోవడం మంచిది. చాలా ధనవంతుడు లేదా చాలా పేద ఇంటి నుండి కోడలిని వివాహం చేసుకోవడం సరికాదు. ధనిక కుటుంబానికి కోడలిగా వస్తే ఆమెను హ్యాండిల్ చేయడం కష్టం. అదీకాక ఆ ఇంటిలోని స్త్రీ నిరుపేద అయితే ఆమె కుటుంబాన్ని నువ్వు చూసుకోవాలి. కాబట్టి ఈ విషయంలో కొడుకు అభిప్రాయం అడగడం మంచిది.



# ఉద్యాన రంగంపై చిన్నచూపా?

- రైతు ఆదాయానికి వెన్నెముకగా నిలవాల్సిన శాఖ ఎందుకు బలహీనంగా ఉంది?
- రాష్ట్ర అవసరాలకు కూడా సరిపోని పండ్లు, కూరగాయల ఉత్పత్తి
- ఉద్యాన శాఖ బలోపేతమే శాశ్వత పరిష్కారం

**తెలంగాణలో సుమారు ఐదు కోట్ల జనాభా ఉంది. అయితే రాష్ట్రంలో పండుతున్న ఉద్యాన పంటలు, ముఖ్యంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి రాష్ట్ర అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతోంది. ఫలితంగా ప్రతి రోజు పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా కూరగాయలు, పండ్లు దిగుమతి అవుతున్నాయి. దీనివల్ల రాష్ట్ర సంపద ఇతర రాష్ట్రాలకు వెళ్లడమే కాకుండా, తెలంగాణ రైతులు పొందాల్సిన ఆదాయం కూడా బయటకు వెలుతోంది.**



**హైదరాబాద్ :** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చగలిగే రంగాల్లో ఉద్యాన రంగం అత్యంత కీలకమైనది. తక్కువ విస్తీర్ణంలో అధిక ఆదాయం, ఏడాది పొడవునా ఉపాధి, విలువ ఆధారిత పరిశ్రమలు, ఎగుమతుల అవకాశాలు, పోషకాహార భద్రత వంటి అనేక ప్రయోజనాలు ఈ రంగం సొంతం. అయినప్పటికీ తెలంగాణలో ఉద్యాన రంగం తన పూర్తి సామర్థ్యాన్ని ఇంకా అందుకోలేకపోతోంది.

## ఉద్యాన విశ్వవిద్యాలయం ఉంది.. బలమైన వ్యవస్థ ఎక్కడ?

రాష్ట్ర విభజన అనంతరం ఏర్పాటైన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ద్వారా డిగ్రీ, డిప్లొమా కళాశాలల నుంచి ప్రతి సంవత్సరం వందలాది ఉద్యాన శాస్త్ర నిపుణులు బయటకు వస్తున్నారు. అయితే వీరిలో చాలామందికి ఉద్యాన శాఖలో ఉద్యోగ అవకాశాలు పరిమితంగానే ఉన్నాయి. ఒకవైపు చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు తగ్గుతుండగా, మరోవైపు రైతులకు అవసరమైన సాంకేతిక సేవలు క్షేత్రస్థాయిలో అందడం లేదు. ఈ పరిస్థితి ఉద్యాన రంగ అభివృద్ధిని ప్రభావితం చేస్తోంది.

## ఉద్యాన శాఖ మాత్రం విస్తరించలేదు

రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరిగి పరిపాలన ప్రజలకు మరింత చేరువైంది. కానీ ఉద్యాన శాఖలో అదే స్థాయిలో పోస్టుల పెంపు జరగలేదు. అనేక జిల్లాల్లో సిబ్బంది కొరత కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన అధికారుల పోస్టులు ఖాళీగా ఉండగా, మరికొన్ని చోట్ల అవసరానికి తగిన సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో రైతులకు సమయానికి సాంకేతిక సలహాలు, పంటల ప్రణాళిక, తెగుళ్ల నివారణ, ప్రభుత్వ పథకాల అమలు వంటి సేవలు సమర్థవంతంగా అందడం కష్టమవుతోంది.

## అరకొర అధికారులతో ఉద్యానాభివృద్ధి సాధ్యమేనా?

ప్రస్తుతం తెలంగాణ ఉద్యాన శాఖలో సుమారు 153 మంది ఉద్యాన అధికారులు మాత్రమే ఉన్నారని, వారిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారి సంఖ్య ఇంకా తక్కువగా ఉందని అందుబాటులో ఉన్న సమాచారం సూచిస్తోంది. 563 మండలాలకు ఈ సంఖ్య సరిపోదు. ఫలితంగా ఒక్కో అధికారి అనేక మండలాల బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు నిరంతర సాంకేతిక సేవలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, వ్యాధులు–తెగుళ్ల నియంత్రణ, మార్కెట్ సమాచారాన్ని అందించడం వంటి అంశాలు ప్రభావితమవుతాయి. రైతు ఆదాయం పెరగాలంటే ఉద్యాన శాఖ బలోపేతం తప్పనిసరి వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులు, వాతావరణ మార్పులు, ధరల అస్థిరత రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతు ఆదాయాన్ని పెంచగలిగే ప్రధాన రంగంగా ఉద్యాన రంగాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

## కొన్ని కీలక చర్యలు అవసరం.

- ఉద్యాన అధికారుల ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేసి ప్రతి మండలానికి కనీసం ఒక ఉద్యాన అధికారిని అందుబాటులో ఉంచాలి.
- ఉద్యాన శాస్త్రం చదివిన యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.
- మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ క్రాప్ ప్లానింగ్ అమలు చేయాలి.
- పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలకు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేయాలి.
- ఉద్యాన రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేసి సేకరణ, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలి.
- కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్ హౌస్‌లు, రైపెనింగ్ చాంబర్లు, రిఫ్రిజిరేటెడ్ రవాణా వంటి మౌలిక వసతులను విస్తరించాలి.
- ఉద్యాన ఉత్పత్తులకు రవాణా సబ్సిడీ, ఎగుమతి ప్రోత్సాహకాలు అందించాలి.
- పండ్లు, కూరగాయలకు ధర భరోసా లేదా కనీస ధర రక్షణ వ్యవస్థను రూపొందించాలి.
- ఉద్యాన పంటలకు ప్రత్యేక పంట బీమా అమలు చేయాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి.
- ఉద్యాన రంగ స్టార్టప్‌లకు ప్రత్యేక విధానం, ఆర్థిక సహాయం అందించాలి.
- సేంద్రియ ఉద్యాన సాగు, పట్టణ మిద్దె తోటల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి.

## ఉద్యాన రంగం బలపడితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకే బలం

ఉద్యాన రంగం కేవలం రైతుల ఆదాయాన్ని పెంచే రంగం మాత్రమే కాదు. ఇది గ్రామీణ ఉపాధి, మహిళల స్వయం ఉపాధి, పోషకాహార భద్రత, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధికి కూడా కీలక ఆధారం. ఈ రంగంలో పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే సామర్థ్యం కలిగి ఉంది.

తెలంగాణలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చాలంటే ఉద్యాన రంగానికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఉద్యాన శాఖను పునర్వ్యవస్థీకరించడం, ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, శాస్త్రీయ సాంకేతిక సేవలను ప్రతి రైతుకు చేరవేయడం ద్వారా మాత్రమే ఈ రంగం ఆశించిన స్థాయికి చేరుకోగలదు. రైతు ఆదాయం పెరగాలంటే ఉద్యాన రంగం బలపడాలి. ఉద్యాన రంగం బలపడాలంటే ఉద్యాన శాఖ బలోపేతం కావాలి. అదే తెలంగాణ వ్యవసాయాభివృద్ధికి శాశ్వత మార్గం.

– జి.అజయ్ కుమార్



# ప్రభాస్ 'ఫౌజీ' వాయిదా

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు హను రాఘవపూడి కలయికలో రూపొందుతున్న 'ఫౌజీ' సినిమా మరోసారి వాయిదా పడనుంది. డిసెంబరు 3న రావాల్సిన ఈ సినిమా కొంచెం వెనక్కి వెళ్లనుందని ఈ చిత్ర నిర్మాత వై.రవిశంకర్ 'ది ప్యారడైజ్' ప్రీరిలీజ్ వేడుకలో ప్రకటించారు. "ఫౌజీ' కొంచెం వెనక్కి వెళ్తోంది. ఇది వేరే లెవెల్ సినిమా. ప్రభాస్‌ని 'బాహుబలి' తర్వాత మళ్లీ అంత గొప్పగా చూపించే చిత్రమిది. కచ్చితంగా ప్రేక్షకులకు జీవితాంతం గుర్తుండిపోతుంది" అన్నారు. త్వరలోనే ఈ చిత్ర కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారు.

# రాయల్స్ సెట్‌లో నోరా ఫతేహి

తనదైన నటన, అదిరిపోయే ప్రత్యేక పాటలతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తుంటుంది అందాల తార నోరా ఫతేహి. ఆమె ఓ కీలక పాత్రలో నటిస్తున్న సిరీస్ 'ది రాయల్స్ సీజన్ 2'. బాలీవుడ్ హీరో ఇషాన్ ఖట్టర్ కథానాయకుడిగా నటిస్తున్నారు. గతేడాది విడుదలై ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న 'ది రాయల్స్'కి సీక్వెల్‌గా దీన్ని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ సిరీస్ చిత్రీకరణ కోసం సెట్లోకి అడుగుపెట్టింది నోరా. ఈ విషయాన్ని తెలుపుతూ.. ఇటీవలే సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టిందామె. రాజకుటుంబం, వారి మధ్య ఉండే సంబంధాల నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ రెండో సీజన్‌కు 'డార్లింగ్స్' ఫేమ్ జస్మీత్ కె.రీన్ దర్శకత్వం వహిస్తున్నట్లు బాలీవుడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.







# అల్లు అర్జున్ రాకా గిన్నిస్ రికార్డు

కథానాయకుడు అల్లు అర్జున్.. దర్శకుడు అట్లీ కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా' సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో అంతర్జాతీయ హంగులతో ముస్తాబవుతున్న ఈ సినిమా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. ఈ చిత్రం కోసం ఏక కాలంలో 37మంది కళాకారుల అభినయాన్ని మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో రియల్ టైమ్‌లో చిత్రీకరించినందుకు గానూ ఈ అరుదైన ఘనతని సాధించింది. ఇలా ఒకేసారి ఎక్కువ మంది వ్యక్తులకు సంబంధించిన హావభావాల్ని మోషన్ క్యాప్చర్ సాంకేతికతో చిత్రీకరించడం ఇదే తొలిసారి. భారతీయ సినీ పరిశ్రమలో సాంకేతికత పరంగా ఇదొక మైలురాయి. ఈ సినిమా కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ ప్రత్యేక మోషన్ క్యాప్చర్ ప్రక్రియని చేపట్టగా.. అందులో 4ఏళ్ల చిన్నారి నుంచి 70ఏళ్ల వయసున్న వ్యక్తి వరకు మొత్తం 37మంది కళాకారులు పాల్గొన్నారు. అంతేకాదు దీని కోసం 92 ఆప్టికల్ మోషన్ క్యాప్చర్ కెమెరాల్ని వినియోగించడంతో పాటు క్యాప్చర్, క్యాలిబ్రేషన్, రియల్ టైమ్ అన్ రియల్ విజువలైజేషన్, ఫేషియల్ క్యాప్చర్, సింక్రనైజేషన్‌తో కూడిన అత్యాధునిక నెట్‌వర్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఫిబ్రవరిలో ఈ సీక్వెన్స్‌ని విజయవంతంగా పూర్తి చేయగా.. దీనికి సెప్టెంబరు 15న అధికారిక గుర్తింపు లభించింది. ఈ ఘనతకు సంబంధించిన అధికారిక సర్టిఫికెట్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ బృందం ఇటీవలే అల్లు అర్జున్, అట్లీలకు అందజేసింది. ఈ రికార్డుకు సంబంధించిన వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ సన్‌పిక్చర్స్ సామాజిక మాధ్యమాల వేదికగా అభిమానులతో పంచుకుంది.

# నేను గెలుస్తానని నమ్మే వాళ్లని గెలిపించేందుకే కష్టపడుతున్నా: నాని

"మన చుట్టూ మనం గెలవాలని కోరుకునే వాళ్లు పెరిగినట్లే.. ఓడిపోతే చూద్దామనే వాళ్లూ పెరుగుతారు. కానీ, నేనెప్పుడూ అలా ఓడిపోవాలని చూసే వాళ్లని ఓడించాలని ప్రయత్నించలేదు. నేను గెలుస్తానని నమ్మే వాళ్లని గెలిపించడానికే కష్టపడుతున్నా" అన్నారు కథానాయకుడు నాని. 'దసరా' విజయం తర్వాత ఆయన.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలిసి చేసిన రెండో చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మించారు. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 24న రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. నిర్మాతలు దిల్‌రాజు, నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో నాని మాట్లాడుతూ.. "దర్శకుడు శ్రీకాంత్‌ది నాది అన్నదమ్ముల అనుబంధం. తనని చూసి చాలాసార్లు గర్వపడ్డా..



ముచ్చటపడ్డా. సినిమా ఆలస్యమవుతున్నప్పుడు పిలిచి క్లాస్ పీకా. కానీ, ఈ చిత్రం మొత్తం చూశాక తన కన్విక్షన్ చూసి చాలా గర్వపడ్డా. సంపూర్ణేశ్‌బాబు ఇందులో బిర్యానీగా ఇరగదీసేశాడు. ఈ చిత్రంలో రాఘవ్ విలనిజం చూసి అంతా ఆశ్చర్యపోతారు. తనలాంటి విలన్‌ని మీరిప్పటి వరకు ఎప్పుడూ చూసుండరు. మోహన్‌బాబు ఏంటన్నది మా తరానికి.. మా ముందు తరానికి బాగా తెలుసు. ఆయన తెరపై కనిపిస్తే ఆ ప్రభావం ఎలా ఉంటుందన్నది ఈ సినిమా కొత్తతరానికి గుర్తు చేస్తుంది. ఈనెల 23 రాత్రి నుంచి థియేటర్లలో వేడుకలు మొదలవుతాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ చెరుకూరి, కయాదు లోహర్, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేశ్ బాబు, రామ్ - లక్ష్మణ్, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో విడాకులు పెరగడానికి కారణమిదే


### కాజల్ అగర్వాల్

మారుతున్న అనుబంధాలు, పెరుగుతోన్న విడాకుల కేసులపై సినీ నటి కాజల్ అగర్వాల్ స్పందించారు. మనుషుల మధ్య అనుబంధాలపై సోషల్ మీడియా ప్రభావం చూపుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. ఫోన్‌ల కారణంగా దంపతుల మధ్య ప్రత్యక్ష సంభాషణలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెస్టరంట్లు, డిన్నర్ డేట్‌లకు వెళ్లినప్పుడు కూడా చాలా మంది.. ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా ఫోన్లకే పరిమితమవుతున్నా రన్నారు. అర్థవంతమైన మాటలు, ఒకరికొకరు సమయం కేటాయించుకోవడం తగ్గిపోవడం వల్లే బంధాల్లో దూరాలు పెరుగుతున్నాయని అన్నారు. "నేను, నా భర్త ఖాళీ సమయాన్ని చాలా గౌరవిస్తాం. ప్రతివారం క్రమం తప్పకుండా డిన్నర్‌కు వెళ్తాం. ఫోన్లను పక్కనపెట్టి ప్రశాంతంగా మాట్లాడుకుంటాం" అని కాజల్ చెప్పారు. సోషల్ మీడియా వ్యామోహం నుంచి బయటపడి భాగస్వామితో.. సమయాన్ని గడపడం అలవాటు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. కాజల్ అగర్వాల్ ఇటీవల 'ది ఇండియా స్టోరీ'తో పలకరించారు. ప్రస్తుతం ఈ సినిమా జియోహాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

# లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, ప్రపంచ బాండ్ల రాబడులు బలహీనపడటం మార్కెట్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. దేశీయ ఈక్విటీ షేర్లలో విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడమూ కలిసొచ్చింది. దీంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,535.18 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,294.96) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 700 పాయింట్ల వరకు ఎగబాకిన సూచీ.. చివరికి 564.03 పాయింట్ల లాభంతో 74,858.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 67.90 పాయింట్లు పెరిగి 23,414.30 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.80గా ఉంది. సెన్సెక్స్30లో భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు మాత్రమే నష్టాలను చవిచూశాయి. మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 101.36 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,350.74 డాలర్ల వద్ద కొనసాగుతోంది.






## సిమ్ దుర్వినియోగం చేస్తే 3 ఏళ్ల జైలు, 50 లక్షలు జరిమానా

నకిలీ లేదా ఇతరుల గుర్తింపు పత్రాలతో సిమ్ కార్డులు తీసుకోవడం చట్టరీత్యా నేరమని టెలికాం విభాగం స్పష్టం చేసింది. సిమ్ కార్డులు, ఫోన్ల నంబర్లను ట్యాంపరింగ్ చేయడం టెలికమ్యూనికేషన్స్ చట్టం–2023 ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని హెచ్చరించింది. ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడితే గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశముందని పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ పాయింట్ ఆఫ్ సేల్ ఏజెంట్ వద్ద ఇటీవల 25 సిమ్ కార్డులను డాట్ గుర్తించింది. పౌరుల సమాచారం లేకుండా వారి ధ్రువపత్రాలతో అక్రమంగా ఈ సిమ్‌కార్డులను యాక్టివేట్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. వెంటనే సదరు ఏజెంట్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో పాటు అనుమానాస్పద నంబర్లను రీ–వెరిఫికేషన్ చేసి డీయాక్టివేట్ చేసింది. ఈ నేపథ్యంలో సిమ్ కార్డు వినియోగం పట్ల పౌరులకు డాట్ అడ్వైజరీ జారీ చేసింది.

**డాట్ కీలక సూచనలు**

తమ పేరిట ఉన్న సిమ్ కార్డులను ఇతరులకు అద్దెకు ఇవ్వడం, బదిలీ చేయడం లేదా విక్రయించకూడదు. ఆ నంబర్లతో సైబర్ నేరాలు జరిగితే సబ్‌స్క్రైబర్‌పై చట్టపరమైన చర్యలుంటాయి. నకిలీ పత్రాలు, మోసపూరిత విధానాల ద్వారా సిమ్‌లు పొందకూడదు. కాలింగ్ లైన్ ఐడెంటిటీని మార్చే యాప్‌లు, వెబ్‌సైట్లు ఉపయోగించకూడదు. ట్యాంపరింగ్ చేసిన ఐఎంఈఐలు ఉండే మోడెమ్‌లు, సిమ్ బాక్స్‌లు వంటి పరికరాలను ఉపయోగించడం లేదా అసెంబుల్ చేయడం నిషిద్ధం తమకు తెలీకుండానే జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పౌరులకు డాట్ సూచించింది. సంచార్ సాథీ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా తమ గుర్తింపుతో ఉన్న అన్ని మొబైల్ నంబర్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని సూచించింది. తెలియని లేదా అవసరం లేని నంబర్లను బ్లాక్ చేయడానికీ ఈ పోర్టల్‌ను వినియోగించుకోవచ్చని సూచించింది. మీ మొబైల్ హ్యాండ్‌సెట్ ప్రామాణికతను ధ్రువీకరించుకోవడానికి అదే వెబ్‌సైట్‌లో 'జెన్యూన్‌నెస్ ఆఫ్ మొబైల్ హ్యాండ్‌సెట్' సదు–పాయం ఉపయోగపడుతుందని తెలిపింది.



## నేడు ఇండియా-జపాన్ టీ20

ఆసియా క్రీడల్లో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగబోతున్న టీమ్ఇండియా.. అంతకంటే ముందే జపాన్‌లో క్రికెట్ మ్యాచ్ ఆడబోతోంది. ఆసియా క్రీడల ఆతిథ్య దేశం జపాన్‌తో భారత జట్టు తొలిసారిగా టీ20 మ్యాచ్‌లో తలపడనుంది. జపాన్‌లో క్రికెట్‌కు ఆదరణ పెంచేందుకు.. ఆ దేశంతో భారత్ దౌత్య సంబంధాలను పెంపొందించేందుకు ఈ మ్యాచ్ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. వేరే క్రీడల్లో బలీయమైన శక్తే అయినప్పటికీ.. క్రికెట్లో మాత్రం జపాన్ పసికూనే. ఈ అసోసియేట్ జట్టుకు టీమ్ఇండియాతో తలపడడం పెద్ద విషయమే. జపాన్‌లో ప్రస్తుతం క్రికెట్ రాజధానిగా పేర్కొంటున్న సానోలోని స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. కెండేల్ కడోవాకి ఫ్లెమింగ్ నాయకత్వంలోని జపాన్ జట్టు.. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమ్ఇండియాకు కనీస పోటీ ఇచ్చినా గొప్పే. ఆసియా క్రీడల్లో బరిలోకి దిగే ముందు జపాన్ పరిస్థితులపై అవగాహన పెంచుకోవడానికి ఈ మ్యాచ్‌ను ఉపయోగించుకోవాలనుకుంటోంది భారత జట్టు. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌లో తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ.. ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశముంది.

# రోహిత్ శర్మకు ప్రపంచకప్ లైన్ క్లియర్..

## ఫిట్‌నెస్‌పై వేచి చూసే ధోరణిలో బీసీసీఐ



వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై ఎన్నో అంచనాలు, విశ్లేషణలు వినిపిస్తూనే ఉన్నాయి. అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి రోహిత్‌ను ఆడించే ఉద్దేశం లేదని గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ దిగిపోవడం ఖాయమేనని తెలుస్తోంది. దీంతో రోహిత్‌ను వన్డేల్లో కొనసాగించడానికి లైన్ క్లియరైనట్లేనని అంతా భావిస్తున్నారు. అయితే, బీసీసీఐ మాత్రం ఈ విషయంలో ఇంకా వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. రోహిత్ ఫిట్‌నెస్‌పై ఇంకా సందేహాలు ఉండటమే ఇందుకు కారణంగా కన్పిస్తోంది. వచ్చే ప్రపంచకప్ టోర్నీకి రోహిత్ స్థానంలో యశస్వి జైస్వాల్‌ను తీసుకోవాలని అగార్కర్ కమిటీ భావించింది. అయితే, బీసీసీఐ ఇందుకు విముఖత వ్యక్తం చేసింది. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేసింది. మరోవైపు, రిటైర్మెంట్ ప్రచారం వేళ.. లార్డ్స్‌లో 138 పరుగుల ప్రదర్శన చేసి రోహిత్ సెలక్టర్లకు సవాల్ విసిరాడు. దీంతో అతడిని వరల్డ్ కప్ వరకు కొనసాగించేందుకే బోర్డు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. కాకపోతే రోహిత్ ఫిట్‌నెస్ విషయంలోనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 39 ఏళ్ల హిట్‌మ్యాన్ గత ఐపీఎల్ సీజన్‌లో గాయం కారణంగా వరుసగా నాలుగు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఇక, బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌లు, ఒత్తిడి లేని మ్యాచుల్లోనే అతడు అదరగొడుతున్నాడనే అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌తో టీమ్ఇండియా సిరీస్ కోల్పోయిన తర్వాతే.. ఆ రెండు జట్లపై రోహిత్ సెంచరీలు చేయడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో వరల్డ్ కప్ టోర్నీకి తాను అందుబాటులో, ఫిట్‌గా ఉండగలనని నిరూపించుకోవాల్సిన బాధ్యత రోహిత్‌పైనే ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ, ప్రపంచకప్ ముందు రోహిత్ ఫిట్‌నెస్ దెబ్బతింటే.. అప్పటికప్పుడు జైస్వాల్‌ను సిద్ధం చేయడం కష్టమవుతుందనే వాదనలూ ఉన్నాయి. అందుకే, ఇప్పటి నుంచే జైస్వాల్‌ను వన్డేల్లో ఆడించాలని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు.

## అప్పటి నుంచే బీసీసీఐతో విభేధాలు!


భారత క్రికెట్‌లో ప్రధాన సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో బీసీసీఐ నిర్ణయాలపై మరోసారి చర్చ మొదలైంది. అగార్కర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా వచ్చిన తర్వాత వైట్‌బాల్ క్రికెట్‌లో టీమిండియా వరుసగా మూడు ఐసీసీ ట్రోఫీలు సొంతం చేసుకుంది. ఆయన హయాంలో సానుకూల అంశాలు చాలానే ఉన్నప్పటికీ, రోహిత్ శర్మ కెప్టెన్సీ తొలగింపు మొదలు అనేక వివాదాలతో అగర్కార్ పదవికి మచ్చను తెచ్చిపెట్టేలా చేశాయి. 2027 ప్రపంచ కప్ కోసం రోహిత్‌ను జట్టులో ఉంచడానికి అతను సుముఖంగా లేనప్పటికీ, బోర్డు మాత్రం ఆ ఆటగాడికి మద్దతు ఇచ్చింది. అయితే నిజానికి అగార్కర్ పదవీకాలం ప్రారంభమైన నాటి నుంచే బీసీసీఐతో సమస్యలు మొదలయ్యాయని 'ది టెలిగ్రాఫ్' తమ నివేదికలో పేర్కొంది. 'ది టెలిగ్రాఫ్' కథనం ప్రకారం.. 2023లో అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన రెండో సమావేశంలోనే ఓ కీలక నిర్ణయం విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అదే ఏడాది ఆగస్టులో ఐర్లాండ్‌తో జరగాల్సిన టీ20 సిరీస్ కోసం భారత జట్టును ఎంపిక చేసే సమయంలో కెప్టెన్సీ అంశం చర్చకు వచ్చినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఆ సమయంలో రుతురాజ్ గైక్వాడ్‌ను భారత టీ20 జట్టుకు కెప్టెన్‌గా నియమించాలని అగార్కర్ భావించినట్లు కథనం తెలిపింది. అనంతరం జరిగిన 2023 ఆసియా క్రీడల్లో భారత జట్టుకు గైక్వాడ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. యువ ఆటగాడికి నాయకత్వ అనుభవం అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం ఉపయోగపడేదనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. అయితే బీసీసీఐ మాత్రం జస్‌ప్రీత్ బుమ్రాను కెప్టెన్‌గా ఎంపిక చేయాలని భావించినట్లు నివేదిక పేర్కొంది. గాయం కారణంగా కొంతకాలం క్రికెట్‌కు దూరంగా ఉన్న బుమ్రా.. ఐర్లాండ్ సిరీస్‌తో తిరిగి అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చాడు. అతడికి ఇది పునరాగమన సిరీస్ కావడంతో బోర్డు నిర్ణయం ఆసక్తికరంగా మారింది. బుమ్రా పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని రుతురాజ్‌కు కెప్టెన్సీ ఇవ్వాలని అగార్కర్ కోరుకున్నట్లు నివేదికలో పేర్కొన్నప్పటికీ.. బుమ్రాకు నాయకత్వం వహించాలనే ఆసక్తి ఉండటంతో బీసీసీఐ అతడినే కెప్టెన్‌గా ఎంపిక చేసిందని కథనం తెలిపింది. ఇక అగార్కర్ చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి వైదొలిగిన తర్వాత అతడి స్థానంలో ఎవరు రానున్నారనేది బీసీసీఐ ఇంకా చెప్పనప్పటికీ, భారత మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.




## యూపీఐ ఇంకొంత కాలం ఫ్రీగా అందించాల్సింది

**నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్**

యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధించడంపై తాజాగా నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ స్పందించారు. కేంద్రం ఇంకొన్నాళ్లు ఉచితంగా యూపీఐ లావాదేవీలను కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'రూ.2 వేలకు మించి చేసే యూపీఐ లావాదేవీలపై వ్యాపారులకు ఎండీఆర్ ఛార్జీలు విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యూపీఐ నిర్వహణకు ఏటా చెల్లించే రూ.20వేల కోట్ల ఖర్చు కంటే.. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వల్ల కలిగే ప్రయోజనాలే ఎక్కువ. ప్రస్తుతం చలామణీలో ఉన్న నగదు వినియోగం కొంత తగ్గే వరకైనా.. యూపీఐను ఉచితంగా అందించాలి. చిన్న వర్తకులు, వ్యాపారులపై 0.4 శాతం ఛార్జీలు విధించడం వల్ల మళ్లీ నగదు వైపు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి' అని పేర్కొన్నారు.



## చెన్నై సూపర్ కింగ్స్‌కు హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్

ఐపీఎల్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్‌కు కొత్త కోచ్ వచ్చాడు. సుదీర్ఘంగా సేవలు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో టీమ్ఇండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ ప్రధాన కోచ్‌గా నియమితులయ్యారు. పూర్వం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గానూ వ్యవహరించాడు. అంతకుమందు ముంబయి ఇండియన్స్ జట్టుతో కూడా పనిచేశాడు. కొత్త ప్రధాన కోచ్ కోసం సీఎస్‌కే అన్వేషిస్తున్నప్పుడు.. ధోని కొన్ని షరతులు పెట్టినట్లు వార్తలు వచ్చాయి. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి భారత్ నుంచే కోచింగ్ బృందం ఉండాలని చెప్పాడట. దీంతో చాలా మంది హేమంగ్ బదానీని సూచించారు. కానీ, అనూహ్యంగా జహీర్ ఖాన్‌ను సీఎస్‌కే ప్రకటించింది.

## యువ భారత్‌దే సిరీస్

ఆస్ట్రేలియా అండర్–19 జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే భారత అండర్–19 జట్టు సొంతం చేసుకుంది. సోమవారం రెండో మ్యాచ్‌లో 103 పరుగుల తేడాతో కంగారూ జట్టును చిత్తు చేసి.. సిరీస్‌లో 2–0 ఆధిక్యం సాధించింది. యశ్వర్ధన్ చౌహాన్ (122), వీకే వినీత్ (87) చెలరేగడంతో మొదట భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 341 (7 వికెట్లకు) పరుగుల భారీ స్కోరు చేసింది. సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (47), కుశాగ్ర ఓజా (34) రాణించారు. వెంకట సుభాష్ (3/64), పరేశ్ (2/23), యశ్వర్ధన్ (2/56) విజృంభించడంతో ఆస్ట్రేలియా జట్టు 41.1 ఓవర్లలో 238 పరుగులకే ఆలౌటైంది. యశ్వీర్‌గౌడ్, మోహిత్, మనాల్ చౌహాన్ తలో వికెట్ తీశారు.

## నేడు లంకతో ఇంగ్లండ్ తొలి వన్డే



శ్రీలంకను టీ20 సిరీస్‌లో వైట్‌వాష్ చేసిన ఇంగ్లండ్ జట్టు వన్డే సిరీస్‌కు రెడీ అవుతుంది. మంగళవారం దుర్హామ్ వేదికగా ఇరుజట్ల మధ్య తొలి వన్డే మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఇంగ్లండ్ తొలి వన్డేకు తుది జట్టును ప్రకటించింది. టీ20 సిరీస్‌లో ఆదిల్ రషీద్ (2 వికెట్లు) తీశాడు. అయితే తాను బౌలింగ్ చేసే చేతికి చిన్న గాయం కావడంతో తొలి వన్డేకు దూరమయ్యాడు. గాయంతో బాధపడుతున్నందున అతడి స్థానంలో 22 ఏళ్ల ఆల్‌రౌండర్ రెహాన్ అహ్మద్‌ను ఎంపిక చేసింది. ఆదిల్ రషీద్‌తో పాటు సొన్ని బేకర్, హెన్రీ క్రోకోంబె కూడా బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశముంది. ఇక టీ20ల్లో మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన టామ్ బాంటన్ వన్డేల్లో తొలిసారి ఓపెనింగ్ స్థానంలో రానున్నాడు. ఏడు వన్డేలాడిన టామ్ బాంటన్ 172 పరుగులు సాధించాడు. ఈ విధ్వంసకర బ్యాటర్ లంకతో రెండో టీ20లో 24 బంతుల్లో 52 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ స్వదేశంలో టీమిండియాతో జరిగిన వన్డే సిరీస్‌ను 2–1 తేడాతో నెగ్గింది. ఆ తర్వాత శ్రీలంకను మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పుడు వన్డేల్లోనూ అదే తరహా జోరు ప్రదర్శించాలని బ్రూక్ సేన భావిస్తోంది. వన్డే ర్యాంకింగ్స్‌లో శ్రీలంక కంటే ఒక స్థానం తక్కువగా ఉన్న ఇంగ్లండ్ (ఏడో స్థానం) సిరీస్ గెలిచి లంకను వెనక్కి నెట్టాలని చూస్తోంది.




## ఎన్‌ఎస్ఈ ఐపీఓ చివరి రోజు 5.67 రెట్ల సబ్‌స్క్రిప్షన్

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. సోమవారం చివరి రోజు నాటికి మొత్తం 5.68 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. బీఎస్ఈ డేటా ప్రకారం.. మొత్తం 8.86 కోట్లు షేర్లకు గానూ 50.21 కోట్లు బిడ్లు దాఖలయ్యాయి. క్వాలిఫైడ్ ఇన్వెస్టర్ బయ్యర్ల నుంచి అధిక డిమాండ్ వచ్చింది. ఎన్‌ఎస్ఈ రూ.22,569 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో దేశంలోనే రెండో అతిపెద్ద ఐపీఓగా వచ్చింది. సెప్టెంబర్ 17న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. నేటితో (సెప్టెంబర్ 21న) ముగిసింది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 6.54 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదుచేసింది. రిటైల్ ఇన్వెస్టర్ల కోటా నుంచి 1.31 రెట్ల సబ్‌స్క్రిప్షన్ మాత్రమే అందుకుంది. ఎక్కువగా క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల నుంచి 12.68 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదుచేసింది. సెప్టెంబర్ 23న డీమ్యాట్ ఖాతాల్లో షేర్ల కేటాయింపులు ఉంటాయి. సెప్టెంబర్ 24న కంపెనీ షేర్లు బీఎస్ఈలో లిస్ట్ కానున్నాయి.